RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 101 బుధవారం 7 మే 2025 పేజీలు : 4

## సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి : ఖర్గే

దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ మెమోరిల్ వద్ద నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలో నూ కేంద్రం జోక్యం చేసుకుంటోం ది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పుతోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని అభివృ ద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతు న్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేలుకొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు' అని ఖర్గే పేర్కొన్నారు.



# సీఎం ముక్కుసూటి మనిషి

## సీఎం రేవంత్‌ను సమర్థిస్తూనే బీఆర్ఎస్‌కు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్..

హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు, అందాల పోటీలపై మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చలకు దారితీస్తున్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన విషయాలను ఉన్నది ఉన్నట్టుగా చెప్తారని, అందువల్ల ఆయనపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక తప్పిదాలను సరిచేస్తున్నామని సీఎం చెప్పడం, రాష్ట్రానికి అవసరమైన మార్పులు తీసుకురావడంలో ఆయన తీవ్రంగా కృషి చేస్తున్నారని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

**బీజేపీపై విమర్శలు :** బీజేపీ ప్రభుత్వంపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు చేస్తూ, ఈ పార్టీకి పాలించే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఏ వ్యవస్థను కూడా హ్యాండిల్ చేయని బీజేపీకి పాలించే అర్హత ఎక్కడిదన్నారు. ఈ వ్యాఖ్యలు, బీజేపీ ప్రభుత్వంపై ప్రజలలో కొత్త అభిప్రాయాన్ని రేకెత్తిస్తున్నాయి. మంత్రులు ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకి వెళ్లాలంటే, కార్ కంటే హెలికాప్టర్ వాడడం ఖర్చు తక్కువ అవుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హెలికాప్టర్ కొనుగోలు చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. ప్రభుత్వానికి అవసరమైన సమయంలో హెలికాప్టర్ వాడడం, ఖాళీగా ఉండడం కంటే మంచిదని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం అడ్డగోలు ఖర్చులు చేసినట్లు ఆరోపించారు.

# హమ్మయ్య..

## ఆర్టీసీ సమ్మె వాయిదా పడింది




తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె వాయిదా పడింది. ఆర్టీసీ జేఏసీ నేతలు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చలు సక్సెస్ అవ్వడం తో సమ్మె ను వాయిదా వేశారు. ఇది ఆర్టీసీ ఉద్యోగుల కోసం మంచి పరిణామం కాగా, వారితో చర్చలు జరపడం, తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించడం అనేది ఒక శుభపరిమాణంగా కార్మికులు భావిస్తున్నారు. ఈ చర్చల్లో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక ప్రధాన సమస్యలు ఎత్తిచూపబడినట్టు సమాచారం. వేతనాలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సేవా నియమాలు వంటి అంశాలను చర్చించి, ఈ అంశాలపై మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఉద్యోగుల వేతనాల పెంపు, భద్రతా పథకాలు వంటివి కార్మిక సంఘాలు కోరడం జరిగింది. ప్రభుత్వం, తమ హామీలను అమలు చేస్తే, కార్మికుల సమస్యలు పరిష్కారం పొందవచ్చని వారు భావిస్తున్నారు. అయితే ఈ చర్చలు తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని, సమస్యలు పూర్తిగా పరిష్కరించడానికి ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని కార్మిక సంఘాల నేతలు స్పష్టం చేశారు. సమ్మె వాయిదా పడినప్పటికీ, కార్మిక సంఘాలు తమ డిమాండ్లను అనుసరించి మరింత చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించేందుకు సరైన నిర్ణయాలు తీసుకుంటే, ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం పరిరక్షించబడుతుంది.

**తాత్కాలిక వాయిదా మాత్రమే.. జేఏసీ నేతలు...** దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ చర్చల్లో ఆర్టీసీ విలీనం అంశంపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఈ చర్చల అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ.. "ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాం. ప్రైవేటు విద్యుత్తు బస్సుల గురించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వమే విద్యుత్తు బస్సులు కొని ఆర్టీసీకి ఇచ్చేలా చర్యలు చేపడతామని మంత్రి అన్నారు. కారుణ్య నియామకాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సింగరేణి మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని మేం కోరాం. విశ్రాంత ఉద్యోగుల బకాయిలు, వేతన సవరణ గురించి సానుకూలంగా స్పందించారు. మా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చేలా, దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సమ్మెను కొంత కాలం పాటు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం.

మా సమస్యల్ని పరిష్కరించకపోతే కచ్చితంగా మళ్లీ సమ్మె తేదీని ప్రకటిస్తాం. ఇది తాత్కాలిక వాయిదా మాత్రమే" అని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయాలని ఇటీవల టీజీఎస్ఆర్టీసీ ఐకాస నేతలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు చర్చలకు ఆహ్వానం రాకపోతే.. మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ క్రమంలోనే సోమవారం భారీ కవాతు సైతం నిర్వహించారు. ఈ క్రమంలో తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# పాకిస్థాన్ టార్గెట్ హైదరాబాద్, వైజాగ్.. గుర్తించిన కేంద్ర ప్రభుత్వం



భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర హెూంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తించబడిన సివిల్ డిఫెన్స్ జిల్లాల జాబితాను విడుదల చేసింది. యుద్ధ ప్రభావం ఉండే ప్రాంతాలను మూడు క్యాటగిరీలుగా విభజించింది. ఢిల్లీ, తారాపూర్ అణు కేంద్రం క్యాటగిరీ 1లో ఉన్నాయి. విశాఖపట్నం, హైదరాబాద్‌లు క్యాటగిరీ 2లో ఉన్నాయి. కేంద్ర జాబితా ప్రకారం ఏఏ ప్రాంతాలు ఏ క్యాటగిరీలో ఉన్నాయో ఓ లుక్ వేద్దాం. **క్యాటగిరీ 1లో ఉన్న ప్రాంతాలు** 1) ఢిల్లీ, ఢిల్లీ (న్యూ ఢిల్లీ, ఢిల్లీ కంటోన్మెంట్ సహా) **క్యాటగిరీ 2, 3లో ఉన్న ప్రాంతాలు** 1) ఆంధ్ర ప్రదేశ్, విశాఖపట్నం 2) తెలంగాణ హైదరాబాద్ **3) అరుణాచల్ ప్రదేశ్ ( క్యాటగిరీ 2)** ఆలోగ్ (వెస్ట్ సియాంగ్) ఇటనగర్, తవాంగ్, హయులింగ్, బొమ్డిలా ( క్యాటగిరీ 3) 4) అస్సాం ( క్యాటగిరీ 2), బోంగైగావోన్, డిబ్రూగఢ్, ధుబ్రి, గోల్పారా, జోర్హాట్, శిబ్‌సాగర్, టిన్‌సుకియా, తేజ్‌పూర్, డిగ్బోయ్, దిలీజన్, బోంగైగావోన్, డిబ్రూగఢ్, ధుబ్రి, గోల్పారా, జోర్హాట్, శిబ్‌సాగర్, టిన్‌సుకియా, తేజ్‌పూర్, డిగ్బోయ్, దిలీజన్, దార్రాంగ్ ( క్యాటగిరీ 3), గోలాఘాట్ ( క్యాటగిరీ 3), కరీమ్‌గంజ్ ( క్యాటగిరీ 3), శిల్చర్ ( క్యాటగిరీ 3), 5) బిహార్ ( క్యాటగిరీ 2 ), బరౌని, కతిహార్, పాట్నా, పూర్ణియా, బెగుసరాయి ( క్యాటగిరీ 3), 6) చండీగఢ్ ( క్యాటగిరీ 2 ), చండీగఢ్, 7) ఛత్తీస్‌గఢ్ ( క్యాటగిరీ 2 ), దుర్గ్ (భిలాయి), 8) దాద్రా %డ% నాగర్ హవేలి ( క్యాటగిరీ 2 ), దాద్రా (సిల్వాసా), 9) డామన్, డయ్యూ ( క్యాటగిరీ 2 ), డామన్, 10) ఒరిస్సా, టాల్చర్ ( క్యాటగిరీ 2 ), ( క్యాటగిరీ 3) బలాసోర్, కోరాపుట్, భువనేశ్వర్, గోపాల్పూర్, హిరాకుడ, పారాదీప్, రౌర్కెలా, భద్రక్, ధేంకనాల్, జగత్సింగ్‌పూర్, కేంద్రాపాడా, 11) పుదుచ్చేరి( క్యాటగిరీ 2 ), పుదుచ్చేరి, 12) పంజాబ్ ( క్యాటగిరీ 2 ), అమృత్‌సర్, భటిండా, ఫిరోజ్‌పూర్, గుర్‌దాస్‌పూర్, హెూషియార్‌పూర్, జలంధర్, లుధియానా, పటియాలా, పఠాన్‌కోట్, అడాంపూర్, బర్నాలా, భాఖ్రా-నంగళ్, హల్వారా, కొర్‌కాపూర్, బటాలా, మోహాలి (ససనగర్), అబోహర్, ఫరీద్‌పూర్ ( క్యాటగిరీ 3), రోపర్ ( క్యాటగిరీ 3), సంగ్రూర్ ( క్యాటగిరీ 3), 13) రాజస్థాన్ ( క్యాటగిరీ 2 ), కోటా, రావత్‌భాటా, అజ్మీర్, అల్వార్, బార్మేర్, భరత్పూర్, బీకానేర్, బుండీ, గంగానగర్, హనుమాన్గఢ్, జైపూర్, జైసల్మేర్, జోధ్‌పూర్, ఉదయ్‌పూర్, సికార్, నాల్, సూరత్‌గఢ్, అబూ రోడ్, నసీరాబాద్ (అజ్మీర్), భివారీ, ( క్యాటగిరీ 3) ఫులేరా (జైపూర్), నాగౌర్ (మెర్టా రోడ్), జాలోర్, బేవార్ (అజ్మీర్), లాల్‌గఢ్ (గంగానగర్), సవాయ్ మాధోపూర్, పాలి, భిల్వారా.



## హైదరాబాద్‌లో గ్లోబల్ బ్యూటీస్ ఎంట్రీ.. డ్రోన్లకు మాత్రం నో ఎంట్రీ..

తెలంగాణ ఖ్యాతి ప్రపంచ నలుదిశలా చాటేలా మిస్ వరల్డ్ 2025 పోటీలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మే 10 నుంచి మే 31 వరకూ జరగనున్న ఈ పోటీలకు దేశవిదేశాల నుంచి అందాల భామలు, మీడియా ప్రతినిధులు, ప్రముఖులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు పోలీసులు. అతిథులు భాగ్యనగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉన్నందున రక్షణా ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రధానంగా ఈ 10 ప్రాంతాల్లో డ్రోన్లను నిషేధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023లోని సెక్షన్ 163 ప్రకారం నగరంలోని 10 ప్రాంతాలలో డ్రోన్లను ఎగరవేయడాన్ని నిషేధించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఈ క్రింది ప్రాంతాలలో రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు లేదా పారా-గ్లైడర్లు లేదా రిమోట్ కంట్రోల్డ్ మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఎగిరేందుకు అనుమతి లేదు.



## ప్రధాని మోదీతో ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ అత్యవసర భేటీ..

# కమ్ముకొస్తున్న యుద్ధ మేఘాలు!

# ఏ క్షణమైనా పాక్‌పై దాడులు..

9, 10,11. ఈ తేదీల్లో పాకిస్తాన్ మీద భారత్ దాడులు చేస్తుందా? పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత్ రంగం సిద్ధం చేస్తోందా?.. ఏ విధంగా చర్యలు ఉండబోతున్నాయ్.. అనేది ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో ఢిల్లీలో వరుసగా సాగుతున్న మీటింగ్‌లు- అంచనాలు మరింత పెంచేస్తున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ప్రధాని మోదీ.. వరుసగా ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు.. ఈ క్రమంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మంగళవారం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలిశారు. ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్.. దేశ భద్రత స్థితిగతులపై మోదీకి బ్రీఫింగ్ ఇచ్చారు.

అయితే.. 48 గంటల్లో మోదీ-దోవల్ భేటీ కావడం ఇది రెండోసారి.. అయితే.. రేపు దేశవ్యాప్త మాక్‌డ్రిల్‌కి ముందు వీరిద్దరి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. నిన్న రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ప్రధానమంత్రిని కలిశారు. అంతకుముందు, వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కూడా మోదీతో సమావేశం నిర్వహించారు. నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిలతో విడివిడిగా సమావేశాలు జరిగాయి. పహల్గామ్ ఉగ్రదాడులకు పాల్పడినవారిని, వారికి మద్దతిచ్చేవారిని ఊహకందని రీతిలో శిక్షిస్తామని ప్రకటించిన ప్రధాని అందుకు అనుగుణంగా వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు.

దేశ భద్రతపై ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 26 మంది మరణించారు.

తర్వాతిరోజు, అంటే ఏప్రిల్ 23నాడు సౌదీ టూర్‌ను మధ్యలోనే ముగించుకుని, ఢిల్లీకి వచ్చిన మోదీ, అదేరోజున అజిత్ దోవల్‌ను పిలిపించుకుని మాట్లాడారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో మోదీ-దోవల్ భేటీలు జరిగాయి. ఈ నేపథ్యంలో రేపటి దేశవ్యాప్త మాక్‌డ్రిల్ తర్వాత ఏం జరుగుతోందన్నదే ఆసక్తిగా మారింది. పహల్గామ్ దాడికి భారతదేశం ప్రతీకారం తీర్చుకునే సమయం, విధానం, స్వభావాన్ని నిర్ణయించుకోవడానికి సైన్యానికి 'పూర్తి కార్యాచరణ స్వేచ్ఛ'ను మోదీ ఇటీవల ఇచ్చారు. 'ఉగ్రవాదానికి గట్టి దెబ్బ' ఇవ్వాలనే దేశం దృఢ సంకల్పాన్ని ఆయన నొక్కి చెప్పారు. సైనిక సంసిద్ధతతో పాటు, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ పౌర సంసిద్ధతను పెంచుతోంది. మే 7, బుధవారం, అన్ని రాష్ట్రాలుచ, కేంద్రపాలిత ప్రాంతాలు 244 పౌర రక్షణ జిల్లాలను కలుపుకుని విస్తృతమైన మాక్ డ్రిల్‌లను నిర్వహిస్తాయి. ఈ కసరత్తులలో వైమానిక దాడి సైరన్‌లను మోగించడం, డ్రిల్‌గా ప్రజలను తరలించడం, భారత వైమానిక దళంతో కమ్యూనికేషన్ సంబంధాలను పరీక్షించడం, నియంత్రణ గదులను సమీకరించడం వంటివి ఉంటాయి.

# సంపాదకీయం

## కోహినూర్ వజ్రం

### భారత్‌కు తిరిగి వస్తుందా..?

బ్రిటన్ మహారాణి కిరీటంలో శోభాయమానంగా వెలిగిపోతున్న కోహినూర్ వజ్రం విషయంలో చాలా కాలంగా భారత్ వైపు నుంచి ఒక ఆకాంక్ష వ్యక్తమవుతోంది దానిని తిరిగి భారత్‌కు అప్పగించాలనేది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న బ్రిటన్ సాంస్కృతిక, మీడియా, క్రీడల శాఖ మంత్రి లీసా నాండీ ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కోహినూర్‌ను తిరిగి భారత్‌కు ఇచ్చేస్తారా? అన్న ప్రశ్నకు ఆమె నేరుగా బదులివ్వకుండా, భారత్, బ్రిటన్ మధ్య సాంస్కృతిక కళాఖండాల మార్పిడి కోసం ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలిపారు. అన్నీ సానుకూలంగా జరిగితే.. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం రావొచ్చని ఆమె నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఇదే అంశంపై తాను భారత్ సాంస్కృతిక శాఖ మంత్రితోనూ చర్చించినట్లు లీసా నాండీ ధృవీకరించారు. అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం ఢిల్లీ చేరుకున్న ఆమె, సాంస్కృతిక శాఖకు సంబంధించిన పలు ఒప్పందాల గురించి కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో చర్చలు జరుపుతున్నారు. తన పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ సృజనాత్మకత, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో భారత్‌తో దృఢమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు లీసా నాండీ తెలిపారు. "సినిమా, టీవీ, మ్యూజిక్, క్రీడా రంగాల్లో బ్రిటన్ దూసుకుపోతోంది. ఆయా రంగాలకు సంబంధించిన బ్రిటన్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. భారత్ సహకరిస్తే.. వాటిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ల వచ్చన్న గట్టి నమ్మకం మాకుంది. అందుకు భారత్ కూడా మద్దతిస్తుందని ఆశిస్తున్నాం" అని ఆమె పేర్కొన్నారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిపైనా లీసా నాండీ తీవ్రంగా స్పందించారు. ఈ దారుణఘటనలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, ఉగ్రవాదం నిర్మూలనకు ప్రపంచదేశాలన్నీ కలిసి రావాలని ఆమె పిలుపునిచ్చారు. కాగా, భారత్‌కు చెందిన 108 క్యారెట్ల విలువైన కోహినూర్ వజ్రాన్ని 1849లో అప్పటి మహారాజ్ దులీప్ సింగ్.. విక్టోరియా మహారాణికి అప్పగించారు. అప్పటి నుంచి ఆ వజ్రం బ్రిటిష్ రాజకుటుంబం ఆధీనంలోనే ఉంది. రాణి కిరీటంలో అమర్చబడిన ఈ వజ్రాన్ని తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం పలు మార్లు దౌత్యమార్గాల్లో ప్రయత్నించినప్పటికీ.. ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో, బ్రిటన్ మంత్రి లీసా నాండీ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరుపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అలాగే అల్వాల్ కు చెందిన మంచాల రవీందర్-రమాదేవి దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. శామీర్ పేట కు చెందిన బత్తిని కృష్ణ గౌడ్ - ఊర్మిళ దంపతులు, వారి కుటుంబ సభ్యులు 50 కేజీల బియ్యం అందజేశారు. ఒంటిమామిడికి చెందిన కరుణాకర్, బొల్లారం బజార్ కు చెందిన గీత లు కూరగాయలు అందజేశారు. మజీద్ పూర్ కు చెందిన ప్రకాష్-కవితా దంపతులు అమ్మవారికి స్వీట్ ప్రసాదం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. తూముకుంటకు చెందిన ఓం ప్రకాష్ గౌడ్ అన్నదానానికి సహకారం అందించాడు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## ప్రభుత్వం గొల్ల కురుమలను విస్మరించింది



శామీర్పేట (గరుడ వార్త) : గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం గొల్ల కురుమలను పూర్తిగ విస్మరించాయని జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల కుమార్, ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య లు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట మల్లన్న ఆలయం వద్ద మండల జి ఎం పి ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్టే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు 2 లక్షల నగదు బదిలీ, రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా హామీని నెరవేర్చకుండా గత ప్రభుత్వం అడుగుజాడల్లో నడుస్తుందని ఆరోపించారు. పశువైద్యశాలల్లో ఎలాంటి మందులు అందుబాటులో ఉండటంలేదని, రెండేండ్ల నుంచి కనీసం నట్టల మందులు సైతం ఇవ్వటంలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు వీధి కుక్కల దాడులు, రకరకాల ప్రమాదాల్లో వందలాది గొర్రెలు చనిపో తున్నాయని తెలిపారు. గొర్రెల కాపరులపై రాష్ట్ర వ్యాప్తంగా ఫారెస్ట్ అధికారుల దాడులు పెరుగుతున్నాయని, రైతు భీమా ఉందనే కారణం చూపి ప్రమాదవశాత్తు మరణిస్తున్న గొర్రెల కాపరులకు ఎక్స్ గ్రేషియా ఇవ్వడంలేదని, రోజురోజుకు గొర్రెల దొంగతనాలు పెరిగిపోతున్నాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ పశుసంవర్ధక శాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించలేదని, ముఖ్యమంత్రి దగ్గరే ఆ శాఖ ఉండటంతో ఎవరికి కలిసే అవకాశం ఇవ్వటం లేదన్నారు. ఈ శాఖకు శాశ్వత డైరెక్టర్ ని, ఇతర అధికారులను నియమించడం లేదని, సమస్యలను ఎవరికి మొర పెట్టుకోవాలో అర్థం కాని స్థితిలో గొర్లకాపరులున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ తో రెండవ విడుత గొర్రెల పంపిణీ చేయాలని, జిల్లా వ్యాప్తంగా అన్ని గొర్రెలు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. సబ్సిడీ మీద జీవాలకు దాణా సరఫరా చేయాలన్నారు. తగినన్ని నిధులు కేటాయించి నట్టల నివారణ మందులు తాగించాలని, అన్ని రకాల మందులు, వాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. పశువైద్యశాలల పని వేళలు ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించేలా మార్పులు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన గొర్రెల కాపరులకు నెలకు రూ.5 వేల పించన్ ఇవ్వాలన్నారు. వివిధ ప్రమాదాలలో చనిపోతున్న గొర్రెల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్రేషియో చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వ ఎన్.ఎల్. ఎం. పథకంలో గొల్ల, కురుమ యువతకు 50 శాతం రిజర్వేషన్తో గొర్రెల ఫామ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగళ్ల(సంతల)ను గొర్రెల పెంపకందార్ల సొసైటీలకు కేటాయించాలని తదితర డిమాండ్ల పై భవిష్యత్తులో ఉద్యమించ నున్నట్లు పేర్కొన్నారు.

మండల నూతన కమిటీ ఎన్నిక....అనంతరం ఈ సమావేశంలో21 మందితో కూడిన నూతన మండల కమిటీ ని ఎన్నుకొన్నారు. శామీర్ పేట మండల అధ్యక్షుడు పినిగంటి కుమార్, ప్రధాన కార్యదర్శి మోటే వేణు, గౌరవ అధ్యక్షుడు బి జాంగిర్, ఉపాధ్యక్షులు గురుకుల సత్యనారాయణ, బి సత్యనారాయణ, నర్ల రాములు, సహాయ కార్యదర్శి లు నర్ల స్వామి, వట్టెల గణేష్, మేకల కుమార్ లను నూతనంగా ఎన్నుకున్నారు.

## పిల్లల ఆరోగ్యంపై.. జాగ్రత్త పడదాం



పెద్దపల్లి : ఎదిగే చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆహారంపై అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు.. ఎత్తుకు తగిన బరువు లేక బాల్యం బలహీనమవుతోంది. గతంతో పోలిస్తే మాతా శిశు మరణాల సంఖ్య తగ్గుతున్నప్పటికీ, ఇప్పటికీ వైద్య సేవలు మెరుగు పడాల్సి ఉంది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన ప్రారంభం.. ఆశాజనక భవిష్యత్తు'(నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ) నినాదాన్ని తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితులపై ప్రత్యేక కథనం.

**9 ఎంసీహెచ్‌లలో అరకొర వసతులు**

ఉమ్మడి జిల్లాలో 67 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 498 ఉప వైద్య కేంద్రాలు, 309 పల్లె, 15 బస్తీ దవాఖానాలు, 15 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 9 మాతా శిశు కేంద్రాలుండగా వసతులు మెరుగుపడాల్సిన అవసరముంది.

**మరణాలకు ఇవీ కారణాలు**

నెలలు నిండకుండానే ప్రసవం, జన్యు లోపాలతో బిడ్డ ఎదుగుదల క్షీణించడం. ఉమ్మనీరు మింగడం, తక్కువ బరువుతో జన్మించడం.
గర్భం దాల్చిన తరువాత పౌష్టికాహారం తీసుకోకపోవడం.
రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడటం.
ప్రసవానికి సకాలంలో ఆసుపత్రికి రాకపోవడం.

సమీక్షించినా మార్పు రావడం లేదు

ఉమ్మడి జిల్లాలో 18,363 మంది గర్భిణులు, 17,198 మంది బాలింతలు, 1,79,006 మంది ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. గడిచిన ఏడాదిలో శిశు మరణాలే అధికంగా నమోదయ్యాయి. 135 మంది శిశువులు, 43 మంది తల్లులు చనిపోయినట్లు వైద్య నివేదికలు వెల్లడిస్తున్నాయి. మాతా శిశు మరణాలపై జిల్లా స్థాయిలో రెండు నెలలకోసారి సమీక్షించినప్పటికీ మార్పు రావడం లేదు.

**సకాలంలో వైద్యుల్ని సంప్రదించాలి**

పిల్లలు పాలు తాగకపోయినా, శ్వాస వేగంగా తీసుకున్నా, వాంతులు, జ్వరం బారిన పడినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రతి రెండు గంటలకోసారి పాలు తాగించాలి. ఏడాది వచ్చేవరకు విటమిన్ డీ3 చుక్కలు వేయించాలి. ఐరన్‌తో పిల్లల మెదడు అభివృద్ధి చెందుతుంది. డా.రవీందర్, పిల్లల వైద్య నిపుణులు,పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రి

**బీపీ అదుపులో ఉంచుకోవాలి**

గర్భిణులకు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ లక్షణాలుంటే వైద్యుల సూచనలు పాటించాలి. రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి. కడుపులో బిడ్డ పెరుగుతుంటే రక్తం తగ్గే అవకాశముంది. శరీరంలో మార్పులు చోటు చేసుకుంటాయి. దానికి తగ్గట్టుగా వైద్యం తీసుకోకుంటే ప్రాణానికే ప్రమాదం. డా.రమాదేవి, స్త్రీ వైద్య నిపుణులు, సుల్తానాబాద్ ఆసుపత్రి పర్యవేక్షకురాలు

## తెల్లబంగారానికి అవినీతి మరకలు

కొత్తగూడెం : భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లోని పత్తి అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడిన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పలువురు అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఉభయ జిల్లాల్లో జిన్నింగ్ మిల్లుల్లో ప్రైవేట్‌గా కొన్న పత్తిని వ్యాపారులు సీసీఐకే అట్టగట్టి రూ.కోట్లు వెనకేసుకున్నారు. పత్తి సాగు విస్తీర్ణం కన్నా అధికంగా రైతుల పేర్లతో సీసీఐకి దళారులు విక్రయించగా.. మరికొన్నిచోట్ల కర్షకులకు తెలియకుండానే వారి పట్టాదారు పాసు పుస్తకాలతో సరకు అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగా.. తాత్కాలిక



రిజిస్ట్రేషన్ (టీఆర్)లో అవకతవకలు జరిగాయని నెల క్రితం భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శిని సస్పెండ్ చేసిన విషయం విదితమే.

**దళారుల రాజ్యంలో రైతు దగా**

రాష్ట్రంలో అత్యధికంగా పత్తి పండించే జిల్లాల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు మొదటి వరుసలో ఉంటాయి. ఇక్కడ తెల్లబంగారం కొనుగోళు మొదలవగానే దళారులు సీసీఐ కేంద్రాల వద్ద వాలిపోతారు. తేమ, తరుగు పేరిట రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొని నకిలీ టీఆర్‌ల సాయంతో పెద్దమొత్తంలో సరకును సీసీఐకి అంటగట్టి సొమ్ము చేసుకుంటారు. రైతులు పత్తి విక్రయించటానికి వస్తే సవాలక్ష కొర్రీలు విధించే సీసీఐ అధికారులు.. దళారులు, వ్యాపారులకు మాత్రం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా మద్దతు ధర కల్పించటం విమర్శలకు దారితీస్తోంది.

**తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలు**

వ్యవసాయశాఖ అధికారుల వద్ద వివరాలు నమోదుకాని రైతులు, కౌలుకు తీసుకునేవారికి టీఆర్‌లు జారీచేస్తారు. సంబంధిత ఏఈఓలు కౌలు, మిగతా రైతులను ధ్రువీకరించి తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు. వీటిని జిన్నింగ్ మిల్లుల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తే సీసీఐకి పత్తి విక్రయించవచ్చు. అయితే భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో ఓ వ్యవసాయ విస్తరణాధికారి.. రైతు సాగుచేసిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమికి ధ్రువపత్రం జారీచేశాడు. భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈ విషయాన్ని పరిశీలించకుండా పత్తి విక్రయానికి అనుమతిచ్చాడు. ఉన్నతాధికారుల తనిఖీల్లో టీఆర్‌ల జారీలో అక్రమాలు వెలుగుచూశాయి. విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అత్యధిక క్వింటాళ్ల పత్తిని విక్రయించిన వ్యక్తుల పేర్లు, ఆధారాలను అధికారులు సేకరిస్తున్నట్లు తెలిసింది. టీఆర్‌లు జారీ చేసిన అధికారులు, ఆమోదం తెలిపిన కార్యదర్శులు, జిన్నింగ్ మిల్లుల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లలో గుబులు మొదలైంది.

## ఆదిలోనే వైద్యం అందించి

పెద్దశంకరంపేట : చిన్నారుల అవయవాల్లో రుగ్మతలు ఏర్పడితే.. ప్రారంభ దశలో చికిత్స చేయిస్తే త్వరగా బయటపడే అవకాశం ఉంటుంది. ఆ రుగ్మత అలాగే ఉండి, ఏళ్లు గడిచిన తర్వాత చికిత్స అందించినా ఫలితం ఉండదని ఆరోగ్యశాఖ భావిస్తోంది. ఇందుకోసం ఆరేళ్లలోపు చిన్నారులకు వైద్య పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన ఆరేళ్లలోపు చిన్నారులకు వైద్య పరీక్షలు చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో ఈ ఏడాది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ద్వారా ఈ వైద్య పరీక్షల నిర్వహణపై మార్గదర్శకాలను విడుదల చేయనుంది. ఈనెల 7 నుంచి జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఈ పరీక్షలు చేపట్టనున్నారు.

**24 వేల మందికి ప్రయోజనం**

ఆర్‌బీఎస్‌కే ద్వారా పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు కంటి పరీక్షలు చేయనున్నారు. దృష్టి సమస్యలతో పాటు, మెల్ల కన్ను, కార్నియా సమస్యలు ఉంటే చిన్నారులకు జిల్లాలోని బోధనాసుపత్రుల్లో తగిన చికిత్స అందించనున్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు కూడా ఇవ్వనున్నారు. చిన్నారుల్లో మానసిక ఎదుగుదల కూడా పర్యవేక్షించి ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్‌ఐఈపీఐడీ)' సహకారంతో వైద్యం అందించనున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎత్తుకు తగ్గ బరువు లేని వారు, తక్కువ బరువున్న ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ పరీక్షల వల్ల 24 వేల మంది చిన్నారులకు ప్రయోజనం చేకూరనుంది.

చిన్నారులకు ప్రయోజనం-హైమావతి, జిల్లా సంక్షేమాధికారి అంగన్‌వాడీ చిన్నారులకు కంటి చూపు, ఇతర వైద్య పరీక్షలు చేస్తే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రారంభ దశలోనే ఆరోగ్య సమస్యలు గుర్తించి వారికి వైద్యం అందిస్తే జబ్బుల నుంచి తొందరగా బయటపడవచ్చు. ఆరోగ్యశాఖ నుంచి సీడీపీఓల ద్వారా సమన్వయం చేసుకొని పరీక్షలు జరిపే అవకాశం ఉంది.

## సాగుకు ప్రోత్సాహం.. అన్నదాతకు ఆదాయం

సంగారెడ్డి : ఆరుగాలం శ్రమించినా అన్నదాతలకు నష్టాలు.. కష్టాలు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కడానికి కొందరు రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. వీరికి అందుబాటులో మార్కెట్ సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్ యార్డుల్లో ఉద్యాన పంట ఉత్పత్తుల విక్రయాలకు ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం వెంటనే అమలైతే అన్నదాతలకు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది.

జిల్లాలో అనుకూల పరిస్థితులు

జిల్లాలోని జోగిపేట, పటాన్‌చెరు, నారాయణఖేడ్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, వట్‌పల్లి, రాయికోడ్‌లో మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తుల విక్రయాలకు మార్కెట్లను ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. సదాశివపేట, జోగిపేట, వట్‌పల్లి, జహీరాబాద్, రాయికోడ్ తదితర చోట్ల యార్డుల్లో అవసరమైన స్థలాలు అందుబాటులో ఉండటం కలిసివచ్చే అవకాశం. వీటిలో రైతులు ఉద్యాన పంటల ఉత్పత్తులు విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధరతోపాటు సమయం కూడా ఆదా అవుతుంది.

జోగిపేటలో సదుపాయాలు లేక..

జోగిపేటలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రూ.1.25 కోట్లతో దుకాణ సముదాయన్ని నిర్మించారు. కూరగాయలు, పూలు, పండ్లను ఇందులో విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. దుకాణ సముదాయం పక్కనే ప్రభుత్వ ఆసుపత్రి శవాగారం గది ఉండటం, మార్కెట్‌లో తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు సదుపాయాలు కల్పిస్తే వ్యాపారులకు సముదాయం అనుకూలంగా ఉంటుంది.

రాయితీపై విత్తనాలు, పరికరాలు..ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.145 కోట్లు కేటాయించింది. ఇందులో జిల్లాకు రూ.10కోట్ల వరకు మంజూరయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నిధుల్లోంచి ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు రాయితీలు అందించనున్నారు. రాయితీ విత్తనాలు, యంత్ర పరికరాలు కర్షకులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

# కలల ఇళ్లు తారుమారు

సిరిసిల్ల: జిల్లాలో పంపిణీ చేసిన రెండు పడక గదులు లబ్ధిదారుల నుంచి చేతులు మారుతున్నాయి. సిరిసిల్ల పట్టణం, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట మండల కేంద్రాల్లో పలు విడతలుగా రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ జరిగింది. వీటిని లబ్ధిదారులు విక్రయిస్తున్నారనే విషయమై తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని రెండు పడక గదుల ఇళ్లను ఇటీవల రెవెన్యూ అధికారుల బృందాలు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పంపిణీ జాబితా ఆధారంగా గృహాల్లో ఉంటున్న వారి వివరాలను సేకరించారు. లబ్ధిదారులకు కేటాయించిన గృహాలు ఇతరులకు విక్రయించినట్లు అధికారుల విచారణలో తేలింది. కాగా ఈ వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. అంతేకాకుండా విడతల వారీగా జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

**ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి..**

సిరిసిల్ల పురపాలికలో పేదల కోసం మండేపల్లి, శాంతినగర్, రగుడు, పెద్దూరు ప్రాంతాల్లో 2052 గృహాలకు రూ.108 కోట్లు వెచ్చించి నిర్మించారు. ఒక్కో యూనిట్ 550 చదరపు అడుగుల విస్తీర్ణంలో మౌలిక వసతులు కలిపి రూ.6.05 లక్షలు వెచ్చించారు. వీటిలో మండేపల్లిలో 27 ఎకరాల్లో జీప్లస్‌టు పద్ధతిలో రూ.87.37 కోట్లతో 1,320 రెండు పడక గదులను నిర్మించారు. ఇక్కడి గృహాలకు మంచి డిమాండ్ ఉంది. పట్టణానికి దూరంగా ఉండటం.. అక్కడి నుంచి సిరిసిల్లకు పనికి రావాలంటే ఇబ్బంది పడేవారు.. మరికొందరు ఇతర అవసరాలకు విక్రయిస్తున్నారు. వీరి అవసరాలను అక్రమార్కులు ఆసరాగా చేసుకొని దందా కొనసాగిస్తున్నారు.

మండేపల్లి, పెద్దూరు, రగుడు ప్రాంతాల్లోని గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయగా శాంతినగర్‌లో లబ్ధిదారుల ఎంపికలోనే నిలిచిపోయింది. 2022 నుంచి విడతల వారీగా 1200 గృహాలను పంపిణీ జరిగింది. పంపిణీకి తొలుత దరఖాస్తులను ఆహ్వానించారు. జాబితా ప్రకటన, వార్డు సభలు ఇలా.. ఆరు విడతల్లో జరిగాయి. ఈలోపు వార్డుల్లో వసూళ్ల దందా మొదలైంది. ఇల్లు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. పంపిణీ సమయంలో ఈ వ్యవహారం పెద్ద దుమారమే లేపింది. వార్డుల్లో సామాజిక వర్గాల రిజర్వేషన్లు కేటాయించారు. అందులో ఒక్కో వార్డుకు 30 నుంచి 40 గృహాలను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు.

ప్రస్తుతం వీటిలో కింద ఉన్నవాటికి రూ.5 లక్షలు, పైన రెండో అంతస్తులో రూ.3 లక్షల చొప్పున గృహాలు విక్రయించారు. మరికొన్నింటిని అద్దెకు ఇస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ధ్రువపత్రంతోపాటు స్టాంప్ కాగితంపై డబ్బులు ముట్టినట్లు ఒప్పందం పత్రం రాసుకున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు లబ్ధిదారుల ఇళ్లలో వేరేవారు ఉండటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒక్క మండేపల్లిలోనే ఇప్పటికీ సుమారు 350 రెండు పడక గదులు బాండ్ కాగితాలపై విక్రయించినట్లు గుర్తించారు. మండేపల్లి, పెద్దూరు రెండుపడక గదుల సముదాయంలో రియల్ వ్యాపారులు మధ్యవర్తులుగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

# బకాయిలు రాబడితేనే.. ఆర్థిక వెసులుబాటు

గోదావరిఖని: సింగరేణి సంస్థకు బొగ్గు, విద్యుత్తు బిల్లులు వివిధ సంస్థల నుంచి రూ.కోట్లలో రావాల్సి ఉంది. మొత్తం రూ.35 వేల కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు జెన్‌కో, ట్రాన్స్‌కోలతో పాటు ఇతర విద్యుత్తు కేంద్రాలు భారీ మొత్తంలో బకాయిలు ఉన్నాయి. ఆయా సంస్థలు బిల్లులు చెల్లించకపోవడంతో సింగరేణి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఒక్కోసారి ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు కూడా చేతులు చాచాల్సిన పరిస్థితి వస్తోంది. బ్యాంకుల వద్ద ఓడీల ద్వారా విడుదల చేసుకుని చెల్లిస్తోంది. దాదాపుగా ఆరేళ్లకు పైగా సంస్థ సరఫరా చేస్తున్న బొగ్గు, విద్యుత్తుకు సంబంధించిన బిల్లులు కంపెనీలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

**పెట్టుబడులు ఆవశ్యకం**

ప్రస్తుతం సింగరేణికి కొత్త గనుల అవసరం ఉంది. నూతన బొగ్గుగనులు ఏర్పాటు చేస్తేనే సంస్థ మనుగడ ఉంటుంది. దీంతోపాటు నూతన విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు వేస్తోంది. రాజస్థాన్‌తో పాటు జైపూర్ ఎస్టీపీపీలో మరో థర్మల్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. వీటికి కనీసం రూ.15 వేల కోట్ల వరకు



అవసరం ఉంటుంది. ఇటీవల ఒడిశాలో నైనీ బొగ్గుబ్లాకు ప్రారంభించగా.. ఉత్పత్తికి అవసరమైన యంత్రాలు, సాంకేతికపరమైన అంశాలకు పెట్టుబడులు అవసరం. త్వరలోనే వీకే ఓసీపీతో పాటు మరి కొన్ని గనుల్లో కంటిన్యూస్‌మైనర్ యంత్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఉపరితల గనుల్లో కొత్త యంత్రాలు కొనుగోలు చేయాల్సి ఉంది. వీటికి అవసరమైన నిధులు వెచ్చించేందుకు సంస్థ భారీ మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తుంది. ప్రస్తుతం పేరుకుపోయిన బకాయిలు వస్తే ఆర్థిక వెసులుబాటు ఉంటుంది.

కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కూడా ఆర్థిక ఇబ్బందులు తప్పటం లేదు. సంక్షేమంలో భాగంగా వైద్య సౌకర్యాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు చేపట్టే పనులకు నిధుల కొరత ఏర్పడుతోంది. సంస్థ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు వెచ్చింపులో కూడా సమస్యలు వస్తున్నాయి. సింగరేణి కొత్తగా నివాస గృహాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. వీటి నిర్మాణానికి రూ.కోట్లలో నిధులు కావాలి. వీటన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిల చెల్లింపులే పరిష్కారం చూపిస్తాయి.

**కుంటుపడుతున్న అభివృద్ధి**

సింగరేణి సరఫరా బొగ్గు, విద్యుత్తు బకాయిలు ఆయా సంస్థలు వెంటనే చెల్లించాలి. లేదంటే ఆందోళనలు చేస్తాం. ఇప్పటికే రూ.కోట్లల్లో బకాయిలు పేరుకుపోయాయి. వాటిని చెల్లించకపోవడం వల్ల సంస్థ అభివృద్ధి కుంటుపడుతోంది. నిధులు వెచ్చించటానికి వెనకడుగు వేస్తోంది. చాలాసార్లు ఈ విషయంపై యాజమాన్యంతో మాట్లాడాం. బకాయి పడిన సంస్థలపై సింగరేణి ఒత్తిడి తేవాలి.

వై.సత్తయ్య, బీఎంఎస్ నాయకుడు

# శాస్త్రవిజ్ఞానం.. కర్షక చైతన్యం



పరిగి : ఖరీఫ్ సీజన్‌కు అన్నదాతలను సమాయత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ క్రమంలోనే ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో ఈనెల 5వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇప్పటికే రైతులు వానాకాలం సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎరువులు చల్లుతుండగా ఇంకొన్ని ప్రాంతాల్లో దుక్కులు దున్నడం ప్రారంభించారు. నకిలీ విత్తనాల బారిన పడటం, ప్రతిసారి వేసిన పంటలనే మళ్లీమళ్లీ వేయడం, అధిక దిగుబడుల సాధనకు మోతాదుకు మించిన ఎరువుల వినియోగంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. సరిగా ఇదే సమయంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా చైతన్యం చేయనుంది.

ఎంతో ప్రయోజనం: సీజన్ సమయంలో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్లడంతో చాలా సమస్యలకు పరిష్కారమార్గం లభించనుందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. రైతు వేదికల ద్వారా ప్రతివారం శాస్త్రవేత్తలతో ముచ్చటించే కార్యక్రమాలు కొనసాగుతున్నా దూరాభారంతో చాలా వరకు రైతులు అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆధునిక శాస్త్రవిజ్ఞానం అందుతున్నది అంతంత మాత్రమే. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో సుమారు 2.97లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులే. అధిక దిగుబడుల సాధనకు రసాయనిక ఎరువుల వాడకంలో పెరిగిన పోటీ అనారోగ్యకరమైన వాతావరణానికి దారితీస్తోంది. సాగులో సూచనలు, సలహాలు ఇతర సమస్యల పరిష్కారానికి కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడనున్నాయి.

**అవగాహన అంశాలు ఇలా**

తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చులను తగ్గించడం.

అవసరం మేరకు రసాయనిక ఎరువులను వినియోగించి నేల సారాన్ని కాపాడటం.

ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను దాచుకోవడం, నష్టపరిహారాన్ని పొందడం.

సాగు నీటిని పొదుపుగా వాడుకోవడం, భావి తరాలకు అందించడం.

పంట మార్పిడి పద్ధతులు పాటించడం, సుస్థిర ఆదాయాన్ని ఆర్జించడం.

మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణతో కలిగే ఫలితాలు పొందడం.

మండలాలు - 20

సాగు భూమి - 8,81,730 ఎకరాలు

వానాకాలం సాగు - 5,85,105 ఎకరాలు

రైతు వేదికలు - 99

నేలలు - నల్లరేగడి, ప్రధాన పంటలు- పత్తి, మొక్కజొన్న, వరి, కంది, మినుము

భూసార పరిరక్షణ, అధిక దిగుబడులే లక్ష్యం

నేలతల్లిని పరిరక్షించడంతో పాటు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించడం లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకోసం మండలాలు, గ్రామాల వారీగా జాబితాను రూపొందించాం. రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని సమస్యను పరిష్కరించుకునేందుకు ఇది చక్కటి మార్గం.

ఎన్.మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

# ఉద్యాన పంటలకు రూ.3.11 కోట్ల రాయితీ



కరీంనగర్ : ఉద్యాన పంటల సాగు పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) అమలు చేస్తున్నాయి. వీటి అమలుతో ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు భారీగా రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. 2025-2026 సంవత్సరానికి రాయితీలకుగాను జిల్లాకు రూ.3,11,00,000 నిధులు కేటాయించారు. పంటనుబట్టి ఎకరాల పరిమితి వేర్వేరుగా ఉంటుంది.

ప్రతి ఎకరాకు రాయితీ వివరాలు ఇలా (రూ.లలో)..

డ్రాగన్ ఫ్రూట్ 65,000, ముదురు మామిడి తోటల పునరుద్ధరణ 9,600, టిష్యు కల్చర్ కింద అరటి సాగుకు 16,800, అవకాడో 12,000, బొప్పాయి 7,200, అధిక సాంద్రత విధానంలో మామిడి సాగుకు 19,200, నిమ్మ సాగుకు 19,200, జామ చెట్లకు 19,200. మిర్చి, టమాట, వంకాయ(వంగ), క్యాబేజి, కాలిఫ్లవర్ నారుకు ఎకరాకు 10 వేలు, వంకాయ, కాకర, బీర అంట్లు కట్టిన మొక్కలు అందిస్తారు. తాడు సాయంతో కూరగాయల సాగుకు, షేడ్‌నెట్ విధానంలో పువ్వులు, కూరగాయల సాగుకు 4 వేల చొప్పున రూ.35.5 లక్షల వరకు రాయితీ ఇస్తారు.

గులాబీ, మల్లె తోటల పెంపకానికి 8 వేలు, దుంప లిల్లి, తదితర దుంప పువ్వుల సాగుకు 16 వేలు, మల్చింగ్ విధానంలో పండ్లు, కూరగాయలు, పువ్వుల సాగులకు 8 వేలు, కనీసం పన్నెండు ఏళ్లపాటు శాశ్వత పందిరి సాగు చేసే రైతులకు అర ఎకరాకు 50 వేలు.

**ఇతర అంశాలకు..**

సమీకృత సమగ్ర సస్యరక్షణ కింద వేసే అన్ని పంటలకు ఎకరాకు రూ.600 చొప్పున రాయితీ ఇస్తారు. తేనెటీగల పెంపకానికి 700 బాక్సులకు, ఒక్కో దానికి రూ.2,400, తేనె తీసే పరికరానికి రూ.8 వేలు రాయితీ ఇస్తారు. ప్యాకింగ్, గ్రేడింగ్ షెడ్డు కింద నాలుగు యూనిట్లకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల రాయితీ ఇస్తారు. మామిడి, అరటి పండ్ల బ్యాగులకు 12.5 ఎకరాల్లో, ఎకరాకు రూ.10 వేలు ఇస్తారు.

1100 ఎకరాల్లో బిందు సేద్యానికి 275 స్ప్రింక్లర్లు ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, సన్న, చిన్న కారు, బీసీ రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ ఉంటుంది.

ప్రీ కూలింగ్ 2 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.1,75,000, కాయలను పండ్లుగా మాగబెట్టే 1 యూనిట్‌కు రూ.35 లక్షలు, 3 చిన్న ట్రాక్టర్లకు రూ.2.45 లక్షల చొప్పున, 9 పవర్‌టిల్లర్లకు రూ.లక్ష చొప్పున రాయితీ, 18 పవర్ వీడర్లకు ఒక్కో దానికి రూ.75 వేల రాయితీ, 29 బ్రష్ కట్టర్లకు ఒక్కో దానికి రూ.20 నుంచి 25 వేల రాయితీ, 5 వర్మికంపోస్టు యూనిట్లకు ఒక్కో దానికి రూ.50 వేల రాయితీ ఇస్తారు.

జిల్లాలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. కరీంనగర్- 89777 14035, హుజూరాబాద్- 89777 14037, చొప్పదండి- 89777 14036, మానకొండూర్- 89777 14034 ఉద్యాన అధికారుల చరవాణి నంబర్లలో సంప్రదించవచ్చు.

అర్హుల నుంచి త్వరలో దరఖాస్తులు

అర్హులైన రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తాం. జిల్లాలో పండ్లు, కూరగాయలు, పువ్వుల తోటల పెంపకానికి కృషి చేస్తున్నాం. ఆసక్తి ఉన్న వారు సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులను అడిగి తెలుసుకోవచ్చు. ఆర్.శ్రీనివాస్ రావు, డీడీ, జిల్లా ఉద్యాన శాఖ

# సర్కారు నిస్సహాయం.. భూమి నిస్సారం

ఆత్మకూరు : రైతులు తమ వ్యవసాయ నేల స్వభావాన్ని తెలుసుకుని తదనుగుణంగా పంటలు పండించాలనే ఉద్దేశంతో 2018లో జిల్లాలో ఎంపిక చేసిన 50 వ్యవసాయ క్లస్టర్లలో మినీ భూసార పరీక్ష కిట్లను ఏర్పాటు చేశారు. ఆయా క్లస్టర్ల ఏఈవోలకు శిక్షణ ఇవ్వడంతో ఏడాది పాటు వ్యవసాయ భూముల మట్టి పరీక్షలు నిర్వహించారు. ఇవి గ్రామాల్లోనే ఉండటంతో రైతులు వినియోగించుకున్నారు. ఆ తర్వాత మినీ భూ సార పరీక్ష కేంద్రాలలో రసాయనాలు అయిపోవడం, కొన్నిచోట్ల రసాయనాల గడువు తేదీ ముగియడంతో పరీక్షలు చేసే పరికరాలు ఆరేళ్ల నుంచి రైతు వేదికల్లో మూలన పడి తుప్పుపడుతున్నాయి. మట్టిలో ఉండే స్థూల పోషకాలు నైట్రోజన్, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, సూక్ష్మ పోషకాలైన.. ఇనుము, బోరాన్, జింక్, రాగి, మాంగనీస్, మాలిబ్డినం, క్లోరిన్, నికెల్ ధాతువుల శాతాలు భూసార పరీక్షల ద్వారనే తెలుస్తాయి. యాసంగి పంటల అనంతరం రైతులు తమ భూముల మట్టి నమూనాలను పరీక్షించుకుంటారు. ఆరేళ్లుగా మినీ భూసార పరీక్షల కేంద్రాలతో పాటు, జిల్లా కేంద్రంలోనూ మట్టి నమూనా కేంద్రంలో పరీక్షలు నిర్వహించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు అనుకూలంగా ఉండే ప్రతి రైతువేదికలో మినీ భూసార పరీక్ష కేంద్రాలు పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

**భూసార పరీక్షల ఆవశ్యకత**

రైతులు బస్తాల కొద్ది ఎరువులను పంటపొలాల్లో కుమ్మరించినా ఆశించిన దిగుబడి సాధించడం లేదు. స్థూల పోషకాలను అందిస్తూ, సూక్ష్మ పోషకాలపై అశ్రద్ధ చేస్తుంటారు. పంట దిగుబడి అనేది నేల సారం, సాగు చేసే రకం, ఎరువుల వేత, ఇతర యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. సహజ సిద్ధంగానే నేలల్లో అనేక పోషక పదార్థాలు ఉంటాయి. రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల సాగు ఖర్చు పెరగడమే కాకుండా భూ భౌతిక లక్షణాలు దెబ్బతినే ముప్పు ఏర్పడుతోంది. పొలాలు ఖాళీగా ఉండే వేసవిలోనే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని వానాకాలం సాగుకు వెళ్లడం మంచిది.

వ్యవసాయ క్లస్టర్ల సంఖ్య: 92

ఏఈవోల సంఖ్య: 92

మొత్తం రైతులు : 2,81,464 జిల్లాలో సాగు విస్తీర్ణం: 3,11,390 ఎకరాలు **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం - గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి**గతంలో ఎంపిక చేసిన వ్యవసాయ క్లస్టర్లకు మినీ భూసార పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. మట్టి పరీక్షలకు రసాయనాలు అయిపోవడంతో క్లస్టర్లలో ఏఈవోలు పరీక్షలు నిర్వహించడం లేదు. మినీ భూసార పరీక్షల కేంద్రాల పరిస్థితిని గతంలో ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రసాయనాల ప్రతిపాదనలు పంపాం. జిల్లా కేంద్రంలోని భూసార పరీక్ష కేంద్రంలో మట్టి నమూనా పరీక్షలు నిర్వహిస్తాం.

# కళాశాల... పిలుస్తోంది

నల్గొండ : నిరుపేద విద్యార్థులకు ఆ కళాశాల వరం. విశాలమైన క్రీడా మైదానం, నూతన తరగతి గదులు, అధునాతన ప్రయోగశాలలు, శుద్ధ జలం, అతి పెద్ద గ్రంథాలయం ఇలా ఎన్నో సౌకర్యాలతో ఆదర్శంగా నిలుస్తోంది నల్గొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనలో ఏటా విద్యార్థులు ఆయా కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. టీఎస్‌కేసీ ద్వారా విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించి వారు కొలువులు సాధించేలా కృషి చేస్తున్నారు. ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వంటి విభాగాలను అమలు చేస్తూ విద్యార్థులను సమాజ సేవలో భాగస్వాములు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు కళాశాల ఆహ్వానం పలుకుతోంది.

గ్రంథాలయం పూర్తిగా డిజిటలైజేషన్ చేశారు. 60 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు కళాశాల ఐడీ కార్డు ద్వారా పుస్తకాలు అందిస్తారు. అకడమిక్‌తో పాటు పీజీ ఎంట్రెన్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, రీడింగ్ హాల్‌లో వివిధ వార పత్రికలు, దినపత్రికలు ఉంటాయి.

**1560 సీట్లు** ఎన్జీ కళాశాలలో డిగ్రీతో పాటు పలు పీజీ కోర్సులు ఉన్నాయి. మొత్తం 10 కోర్సుల్లో 27 గ్రూపులు ఉన్నాయి. బీఎస్సీ,




బీఏ, బీకాంతో పాటు బీసీఏ, బీబీఏ వంటి అదనపు కోర్సులుండగా ఆయా విభాగాల్లో మొత్తం 1560 సీట్లున్నాయి. ఈ సీట్లన్ని దోస్త్ ద్వారానే భర్తీ అవుతాయి. ఇక్కడ చదువుకోవడం అదృష్టం: లీలావతి, విద్యార్థిని నేను బీఏ ప్రథమ సంవత్సరం ఇటీవల పూర్తి చేశాను. కళాశాలలో సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నూతన భవనంలోకి తరగతులు ప్రారంభించారు. ప్రయోగశాలలు ఎంతో బాగున్నాయి. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఎంతో మెరుగ్గా పాఠాలు బోధిస్తున్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎన్జీ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపాలి.

దరఖాస్తు చేసుకోవాలి : ఉపేందర్, ఎన్జీ కళాశాల ప్రిన్సిపల్

ఎన్జీ కళాశాలకు రాష్ట్రంలోనే గొప్ప చరిత్ర ఉంది. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారు. ప్రస్తుతం కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్ ఉంది. రానున్న రోజుల్లో ఏ గ్రేడ్ సాధన కోసం మరింత కృషి చేస్తాం. విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపులో దోస్త్ ప్రక్రియ ద్వారా ప్రవేశం పొందవచ్చు.

# 'మీ సేవ'లకు మా ఇష్టం

సూర్యాపేట : ఈ చిత్రంలో కనిపిస్తున్న ధరల పట్టిక ప్రతి మీ సేవ కేంద్రంలో ఉంటుంది. కానీ పట్టికను ఎవరూ పాటించట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. అదనపు వసూళ్లపై అడిగితే ఛార్జీలు పెరిగాయని చెబుతుండటం గమనార్హం. డబ్బులు చెల్లించినట్లు రసీదులు కూడా ఇవ్వని దుస్థితి కొన్ని చోట్ల నెలకొంది. ప్రతి కేంద్రంలో ధరల పట్టిక గోడలకు పరిమితమైందని చాలామంది చెబుతున్నారు.

ప్రజలకు సులభంగా, వేగంగా, సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం మీ సేవ కేంద్రాలు నడిపిస్తోంది. కానీ అవి దళారీ కేంద్రాలుగా మారాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరను తుంగలో తొక్కి దోపిడీకి పాల్పడుతున్నారు. రెవెన్యూ, ఆహార భద్రత కార్డులు, సదరం, కులం, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు, పలు రకాల పన్నుల చెల్లింపులకు తప్పనిసరిగా మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిందే. ఇదే అదనుగా భావించి అదనంగా వసూళ్లు చేస్తున్నా.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవైందనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో మొత్తం 91 మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. వీటి నుంచి ఉన్నతాధికారులకు మామూళ్లు ఇస్తున్నామని కొందరు నిర్వాహకులు బాహాటంగా చెబుతుండటం గమనార్హం. దీంతోనే తనిఖీలు చేయట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ లేబర్




కార్డు పునరుద్ధరణకు జిల్లా కేంద్రంలోని ఓ మీ సేవ కేంద్రాన్ని ఆశ్రయించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రూ.35 వసూలు చేయాల్సి ఉండగా వారు మాత్రం రూ.150 డిమాండ్ చేశారు. ఇదేంటని సదరు మహిళ ప్రశ్నించగా.. అంతే తీసుకుంటాం.. లేకుంటే ఇక్కడి నుంచి వెళ్లాపోవాలంటూ హుకూం జారీ చేశారు. సదరు మహిళ చేసేది లేక అడిగినంత చెల్లించి అక్కడి నుంచి వెనుదిరిగారు.

సూర్యాపేట పట్టణం కుడకుడ రోడ్డులోని ఓ కేంద్రంలో మరణ ధ్రువపత్రానికి రూ.85 వసూలు చేయాల్సి రూ. వంద తీసుకున్నారు. కొందరు నిర్వాహకులు రూ.150 వరకు డిమాండ్ చేస్తున్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి పట్టణానికి చెందిన ఓ యువకుడు సూర్యాపేట పట్టణంలోని ఓ కేంద్రానికి వెళ్లి కులం, ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేయగా రూ.100 వసూలు చేశారు. కానీ ధరలో పట్టికలో రెండింటికి రూ.90 మాత్రమే ఉంది. ఇలా ఒక్కో పత్రం పేరిట రూ.10 నుంచి రూ.50 వరకు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

నేరుగా ఫిర్యాదు చేయండి : గఫార్ అహ్మద్, ఈడీఎం, సూర్యాపేట

మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అదనంగా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు నేరుగా మాకు ఫిర్యాదు చేయండి. దగ్గరలోని తహసీల్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేయవచ్చు. రసీదులు కచ్చితంగా ఇవ్వాలి.

# కన్నేస్తే కనిపెట్టేస్తారు

హైదరాబాద్ : నగర శివారు ప్రాంతాల్లో చెరువులు, జలవనరుల ఆక్రమణకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రతి చెరువు, జలవనరుకు సంబంధించిన వివరాలను సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాల్లోని చెరువుల్లో అరవై శాతానికిపైగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, ప్రధానంగా ఐటీ కారిడార్, ఉప్పల్, మేడ్చల్ చుట్టూ విస్తరించి ఉన్నాయి. ఈ క్రమంలో ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా గ్రామ నక్షాలు, డిజిటల్ సర్వే నిర్వహించి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్ధయిస్తున్నారు. అనంతరం ప్రతి చెరువుకు జియోట్యాగ్ చేసి వివరాలు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. చెరువులు, జలవనరుల రక్షణకు రెండు జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు స్థిరాస్తి వెంచర్లకు సమీపంలోని చెరువులను తరచూ పరిశీలించి ఫొటోలు, వీడియోలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాయి. చెరువుల వద్ద సీసీ కెమెరాలు పెట్టనున్నారు.

**గుర్తించిన అంశాలు**



గ్రామ నక్షాలు, సర్వే ఆధారంగా చెరువులకు సమీపంలో వెంచర్లు వేసిన, భవనాలు నిర్మించిన వారిలో కొందరు బఫర్‌జోన్‌లను ఆక్రమించినట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని తేల్చారు. వందకుపైగా చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లను మార్చేసినట్లు తేలింది. కుత్బుల్లాపూర్ మండలంలో బఫర్‌జోన్‌లో ఓ వ్యక్తి విల్లాలు నిర్మించగా వాటిని కూల్చి హద్దులు ఏర్పాటు చేశారు.

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చెరువులు: 2094
సర్వే చేసేందుకు గుర్తించినవి 1698
ప్రాథమికంగా పూర్తయినవి 1189
వెబ్‌సైట్‌లో నమోదైనవి 275

# అప్రమత్తతే.. ప్రాణాలకు రక్ష

జగిత్యాల : విద్యుదాఘాతంతో ప్రాణనష్టాన్ని నివారించేందుకు విద్యుత్తు సంస్థ ఈనెల 7 వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోంది. సిబ్బందికి విద్యుత్తు ప్రమాదాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూనే ప్రజలు విద్యుదాఘాతానికి గురికాకుండా ఉండేందుకు అవగాహన కల్పించే చర్యలు క్షేత్రస్థాయిలో ఈ వారం రోజులపాటు తీసుకోనున్నారు. మొదట విద్యుత్తు సిబ్బందికి భద్రత సూచనలపై అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రత్యేక చర్యలు**

ఇటీవల విద్యుత్తు సంస్థ ఆన్‌లైన్ లైన్ క్లియర్(ఎల్‌సీ) విధానాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో క్షేత్రస్థాయి అధికారికి ఆన్‌లైన్‌లో లైన్ క్లియరెన్స్ ఎందుకోసం తీసుకుంటున్నామనే దానిపై సమాచారం ఇవ్వాలి. అనంతరం ఆపరేటర్లు ఆన్‌లైన్‌లోనే ఏ ఫీడర్కు లైన్ క్లియర్ కావాలో తెలియజేయాల్సి ఉంటుంది. ఫీడర్ తాలుకా ఫొటో సైతం ఆపరేటర్ లైన్‌మెన్‌కు పంపాల్సి ఉంటుంది. ఇలా సంస్థ ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనుంది.

క్షేత్రస్థాయి సిబ్బంది లైన్ క్లియర్(ఎల్‌సీ) తీసుకున్న లైన్‌కు రెండు చోట్ల ఎర్తింగ్‌రాడులు బిగించాలి. డబుల్ ఫీడర్ ఉంటే విద్యుత్తు కనిపెట్టే పరికరాన్ని వెంట తీసుకువెళ్లి ఫీడర్‌లో సరఫరా లేదనే విషయాన్ని నిర్ధారించుకోవాలి.



**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్తు స్తంభాలను, సంబంధిత ఉపకరణాలను ముట్టుకోరాదు.

పశువులను మేతకు తీసుకువెళ్లినప్పుడు అవి నియంత్రికలు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి.

ఇంట్లో నాణ్యమైన విద్యుత్తు ఉపకరణాలను వాడాలి.

మోటారు మరమ్మతు అర్హత కలిగిన మెకానిక్, ఎలక్ట్రీషియన్‌తో చేయించాలి.విద్యుదాఘాతానికి గురైన వారిని రక్షించడానికి వారిని నేరుగా పట్టుకోరాదు. కర్రతో విద్యుత్తు తీగను వేరు చేయాలి.

తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న తక్కువ ఎత్తులోని విద్యుత్తు తీగలను తాకకూడదు. వీటిని గమనించిన వెంటనే స్థానిక విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారుల చరవాణి నంబర్ లేకుంటే విద్యుత్తు సంస్థ ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయాలి.

**వ్యవసాయ మోటార్ల వద్ద..**

రైతులు వ్యవసాయ మోటారుతోపాటు, స్టార్టర్ బాక్స్‌లకు ఎర్తింగ్ చేయించుకోవాలి మోటారుకు వినియోగించే తీగ అతుకులు లేకుండా చూడాలి. వ్యవసాయ క్షేత్రంలో నేలపై ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్తు వైర్లు వేయరాదు స్టార్టర్ బాక్స్‌లు ఇనుప వాటి స్థానంలో ప్లాస్టిక్ డబ్బాలు వాడాలిప్రతి రైతు తన వెంట టెస్టర్ తీసుకువెళ్లడం ఉత్తమం

**అవగాహన కల్పిస్తున్నాం** విద్యుత్తు విషయంలో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరుగుతుంటాయి. రైతులు, వినియోగదారులు ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వారోత్సవాల్లో భాగంగా అధికారులు, సిబ్బంది భద్రత చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
రమేశ్‌బాబు, ఎస్ఈ, కరీంనగర్

# అక్రమ లేఅవుట్లపైకి బుల్డోజర్లు



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పరిధిలో సర్వే నంబరు 124, 125లో 20 ఎకరాలలో హౌసింగ్ సొసైటీ పేరుతో లేఅవుట్ వేసి విక్రయించారు. అనంతరం లేఅవుట్‌లోని రహదారులు, పార్కుల కోసం కేటాయించిన స్థలాలను కబ్జా చేసి వాణిజ్య నిర్మాణాలు చేపట్టారు. ఓ కన్వెన్షన్ సెంటర్‌ను కట్టారు. దీనిపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.మేడ్చల్ జిల్లా పోచారం పుర పరిధి అన్నోజిగూడలో సర్వే నంబరు 9, 10లో పది ఎకరాల్లో లేఅవుట్ వేశారు. పార్కు, ఇతర సామాజిక అవసరాల కోసం వదిలిన ఎకరా స్థలంలోనూ ప్రస్తుతం లేఅవుట్ వేసి యజమాని విక్రయిస్తున్నట్లు హైడ్రాకు ఫిర్యాదులు రావడంతో వెంటనే చర్యలకు ఉపక్రమించారు. నిన్నా మొన్నటి వరకు చెరువులు, ప్రభుత్వ ఆక్రమణలపై కన్నెర్రజేసిన హైడ్రా కొద్దిరోజులుగా అక్రమ లేఅవుట్లు, సామాజిక స్థలాల కబ్జాలపై బుల్డోజర్లను పంపిస్తోంది. లేఅవుట్లపై కొద్దిరోజులుగా హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**లేఅవుట్ల ఆక్రమణల తీరు** హెచ్ఎండీఏ పరిధిలో లేఅవుట్లను వేసే ముందు అనుమతులు తీసుకోవాలి. వ్యవసాయ భూమికి ముందుగా భూమార్పిడి రుసుము చెల్లించాలి. లేఅవుట్‌లో 10 శాతం స్థలాన్ని సామాజిక ప్రయోజనాలకు, పార్కు ఇతరత్రా అవసరాలకు వదిలిపెట్టాలి. రహదారులు 40, 60 అడుగులు ఉండాలి. ఇవన్నీ చేశాకే నివేశన స్థలాలు విక్రయించాలి. కొన్ని దశాబ్దాలుగా రియల్ వ్యాపారులు ఇవేమీ పట్టించుకోకుండా లేఅవుట్‌లను ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే వస్తున్నాయని అనుమతులు లేకపోయినా చాలామంది కొనుగోలు చేశారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇలాంటి లేఅవుట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. **అనుమతులు లేకుండానే..**

భూమార్పిడి, మ్యుటేషన్‌లు చేయకుండా స్థలాలు విక్రయించడంతో రెవెన్యూ రికార్డులు మారలేదు. దీంతో లేఅవుట్ వేసిన వ్యాపారులు రోడ్లను మూసేసి, పార్కుల కోసం వదిలివేసిన స్థలాలను తాజాగా విక్రయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. మ్యుటేషన్ చేయకపోవడంతో ఆ భూమి వారసులు తమదేనంటూ కొత్త వివాదాలు సృష్టిస్తున్నారు. రికార్డులు చూస్తే భూమి పట్టాదారు పేరుపై ఉంటోంది. చేసేది లేక కొనుగోలుదారులు పట్టాదారులు అంటూ వస్తున్న వారసులతో 'బేరాలు' కుదుర్చుకుని రాజీ చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వడంతో చాలామంది సామాజిక ప్రయోజనాల కోసం వదిలిన స్థలాలను రూ.కోట్లలో విక్రయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.

**స్వరూపం మార్చితే చర్యలు– ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్**

లేఅవుట్ల స్వరూపం మార్చినా.. రహదారులకు అడ్డంగా ప్రహరీలు నిర్మించినా కఠిన చర్యలు ఉంటాయి. ప్రజావసరాలకు వదిలిన స్థలాలను ఆక్రమించి విక్రయిస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం.

# అనుమతి మాటున.. అక్రమాల మేట!



తాండూరు : ఇసుక అక్రమ రవాణా భూగర్భ జలాలను అడుగంటిపోయేలా చేస్తోంది. కొందరి ధనార్జన అందరి ప్రయోజనాలను కాలరాసేలా చేస్తోంది. ప్రభుత్వ పనుల పేరిట కాగ్నా నదిలో ఇసుక తరలింపునకు అనుమతులు పొందుతూ.. ఇష్టానుసారం తోడేస్తున్నారు. ఈ అక్రమాలకు కట్టడి చేయాల్సిన వారే ఇందులో భాగస్వామ్యం కావడం శోచనీయం. వీరి తీరుతో నీటితో కలకలలాడాల్సిన కాగ్నా అడుగంటిపోయింది.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రహదారులు, ట్యాంకులు, కాల్వలు, ప్రభుత్వ భవనాలు వంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుక పొందేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి పత్రాలు జారీ చేస్తున్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్, పాతతాండూరు కాగ్నా నదిలోంచి ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చారు. దూరం ప్రకారం రోజుకు ఒక్కో ట్రాక్టర్‌లో 4 ట్రిప్పులు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తరలించాలన్నది నిబంధన. అయితే క్షేత్రస్థాయిలో కొందరు ఆరు నుంచి ఎనిమిది ట్రిప్పులు తరలించి, ఇసుక మేటలను కొల్లగొడుతున్నారు. రాత్రి 7గంటల వరకు దర్జాగా ప్రైవేటు పనుల వద్దకు చేరవేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4వేల నుంచి రూ.5వేలకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి ఇస్తున్న రెవెన్యూ, గనులు భూగర్భ శాఖల అధికారులు పర్యవేక్షణ చేయడం లేదు. దీంతో అక్రమ రవాణాకు అడ్డు లేకుండా సాగిపోతోంది.

సమాచారం ఇస్తే దాడులు..: కొందరు అర్ధరాత్రి కూడా తవ్వకాలు చేపడుతున్నారు. గతనెలలో వీర్‌శెట్టిపల్లి శివారు కాగ్నా నదిలో యాలాల మండలం అగ్గనూరుకు చెందిన వారు అర్ధరాత్రి ఇసుక తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను ఎస్సై జప్తు చేసి కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై ఇసుక తరలింపుదారులు దాడి చేసి గాయపరిచారు.

**అరికట్టాల్సిన వారే..:** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కొందరు పోలీసులు అర్ధరాత్రి నది వద్దకు వెళ్లి ట్రాక్టర్లను జప్తు చేసి కేసు నమోదు చేస్తున్నారు. కొందరు ఇందుకు భిన్నంగా ఏకంగా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. యాలాల మండలంలోని ఓ పోలీసు అధికారి రెండు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి ఇసుక రవాణా చేయిస్తున్నారు. అక్రమాన్ని అడ్డుకోవాల్సిన అధికారే ఇసుక తరలించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

నిఘా పెట్టి చర్యలుబాలకృష్ణారెడ్డి, డీఎస్పీ

కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణాపై సిబ్బందితో నిఘా పెట్టిస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేస్తాం. అనుమతి ఇచ్చిన ప్రకారమే తరలించాలి. లేదంటే చర్యలు తప్పవు.

# నిధులు 'మురుగు'పాలు!

నల్గొండ: జిల్లా ఆసుపత్రిలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ట్రీట్‌మెంట్ ప్లాంటు ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంటోంది. సంబంధిత గుత్తేదారు అసంపూర్తి పనులు చేసి చేతులెత్తేశారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వ్యర్థాల నిర్వహణ ప్లాంటుపై నిర్లక్ష్యం**

ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం వేలాది మంది రోగులు రాకపోకలు సాగిస్తుంటారు.. రోజువారీ వచ్చే రోగులు కాకుండా వారితో పాటు బంధువులు, శ్రేయోభిలాషుల తాకిడి సైతం ఉంటుంది. వీరందరికీ సరిపడేలా జిల్లాసుపత్రిలో మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయి. నిత్యం వ్యర్థాలు చుట్టుపక్కల వదిలేయడంతో స్థానికుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని 2022లో పట్టణ ప్రగతి నిధుల కింద ప్లాంటు మంజూరైంది.

**సమన్వయ లోపం**జిల్లాసుపత్రిలో మాతాశిశు సంరక్షణ నుంచి మొదలు జనరల్, శస్త్ర చికిత్స, అత్యవసర, క్రిటికల్ కేర్, ఇతరత్రా 30 విభాగాలకు నిత్యం మిలియన్ లీటర్ల నీరు అవసరం అవుతుంది. దీనికి తోడు శస్త్రచికిత్సల సమయంలో, థియేటర్లు శుద్ధీకరణ చేసే సమయంలో వ్యర్థ నీళ్లు నిత్యం వృథా అవుతున్నాయి. ఆ నీటిని ఈ ప్లాంటుకు పంపించి శాస్త్రీయంగా శుద్ధి చేస్తే నీటి కొరత ఉండదు. భూగర్భ జల వనరులు సమతుల్యంగా ఉంటాయి. ఈ ప్లాంటును పురపాలక సంఘం పారిశుద్ధ్య విభాగం, సివిల్ పనుల గుత్తేదారులు పూర్తి చేయాల్సి



ఉన్నప్పటికీ తరచూ ఎన్నికలు రావడం, నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో వారు అనుసంధాన పనులు చేయకుండానే వెళ్లిపోయారు. ఆసుపత్రి విభాగాల నుంచి ఈ ప్లాంటుకు వ్యర్థ నీటి అనుసంధానం చేయకపోవడంతో మూడేళ్ల నుంచి నిరుపయోగంగానే ఉంది. ఆసుపత్రికి వెనుక వైపు ప్లాంటును నిర్మించినప్పటికీ అనుసంధాన పనులు అసంపూర్తిగా ఉండటం, మధ్యలో ఎన్నికల కోడ్, చేసిన పనులకు నిధులు సకాలంలో రాకపోవడం మూలంగా ఇలా ప్లాంటు మొత్తం ముళ్ల కంపతో కనిపిస్తోంది. ఈ విషయాన్ని పురపాలక శాఖ ఏఈ దిలీప్‌తో ప్రస్తావించగా ఇటీవలే తాను బాధ్యతలు స్వీకరించానని, ప్లాంటు నిర్మాణం పూర్తయ్యిందని ఆసుపత్రి వారే బాధ్యత వహించాలని తెలిపారు. జిల్లాసుపత్రి డాక్టర్ అరుణ కుమారి దృష్టికి తీసుకెళ్లగా పురపాలక శాఖ బాధ్యులు అసంపూర్తి పనులు చేశారని, ఆసుపత్రికి సంబంధం లేదని చెప్పడం గమనార్హం.

# అన్నదాతల్లో ఆశలు

జగిత్యాల : ఇటీవల రైతుల సాగుభూముల భూసార పరీక్షలు తగ్గినందున మట్టిపరీక్షలను తప్పనిసరి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించటంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. సాధారణంగా ప్రతి 2.5 ఎకరాలకొక నమూనాను తీసి విశ్లేషిస్తేనే కచ్చితమైన ఫలితాలు వస్తాయి. కానీ తక్కువ విస్తీర్ణంలో నమూనాలు తీయటం, ఫలితాలను ఆలస్యంగా ఇవ్వటంతో చాలామంది రైతులు ఆచరించటంలేదు. భూసార పరీక్షల్లేక, ఫలితాలు పొందినవారు కూడా రసాయన ఎరువుల మోతాదును విస్మరించటంతో సిఫారసుకన్నా 15–51 శాతం వరకు అధికంగా ఎరువులు వాడుతున్నారు. 2.5 ఎకరాలకొక మట్టినమూనాను విశ్లేషించాలన్న ప్రభుత్వం అంచనా ప్రకారం జిల్లాలోని భూమినిబట్టి కనీసం 1.75 లక్షల పరీక్షలు చేయాలి. ఒకసారి పరీక్షిస్తే మళ్లీ 2–3 సంవత్సరాల తరువాత మళ్లీ పరీక్షించాలి. ఎరువుల ధరలు, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగానే ఎరువుల మోతాదును నిర్దేశించుకోవటం అవశ్యంగా మారింది.

జిల్లాలో సరైన విశ్లేషణకేంద్రం లేక మట్టినమూనాలను కరీంనగర్‌కు పంపించాల్సి వస్తుండగా జిల్లాలోనే పూర్తిస్థాయి పరీక్షలకు ఇకమీదట ఏర్పాట్లు చేయాలి. 71 ఏఈవో క్లస్టర్లలోని రైతు వేదికల్లో మినీ భూసార పరీక్ష కేంద్రాలకు నిధులు విడుదల చేసి వినియోగంలోకి తేవాలి.



అధికారుల సిఫారసు మేరకు జగిత్యాలలో రూ.60 లక్షల నిధులతో భూసార పరీక్ష కేంద్రాన్ని నిర్మించాలి. చల్‌గల్ వాలంతరి ప్రదర్శన క్షేత్రంలోని ల్యాబ్‌ను వినియోగించటం, పొలాస వ్యవసాయ కళాశాల, పొలాస పరిశోధనస్థానంలోనూ భూసార పరీక్షలు చేయించటంద్వారా భూసార పరీక్షల సంఖ్యను పెంచవచ్చు. కేంద్రం సూచించినట్లుగా భూసార పరీక్ష ఫలితాల కార్డులున్నవారికే రసాయన ఎరువులను విక్రయించాలి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించి భూసార పరీక్షలను చేయించాల్సి ఉంది.

**సమగ్ర వివరాలతో కార్డులివ్వాలి**

ప్రతి మొక్క తన జీవిత చక్రం పూర్తి చేసుకోవడానికి 17 రకాల పోషకాలు అవసరం. వీటిలో కర్బనం, ఆక్సిజన్, హైడ్రోజన్, నీరు, బొగ్గుపులుసు వాయువు, ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, ద్వితీయ పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్‌తో పాటు సూక్ష్మపోషకాలైన ఐరన్, జింక్, కాపర్, బోరాన్, నికెల్, మాలిబ్దినం, మాంగనీస్ ఉండాలి. భూసార పరీక్షల ద్వారా ప్రధాన, ద్వితీయ, సూక్ష్మపోషకాల శాతం తెలిస్తే మనం వేయాల్సిన ఎరువుల శాతం తెలుస్తుంది. భూమి స్వభావం పీహెచ్ స్థాయి అంటే ఆమ్ల గుణమా క్షార గుణమా, మధ్యస్థమా అనే వివరాలు, ఎలక్ట్రో కండక్టివిటీ (ఈసీ) లవణాల మోతాదును, సస్యరక్షణ సిఫారసులు తెలుస్తాయి కాబట్టి రైతులందరి నేలలను పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.రైతుభరోసా పోర్టల్‌లో జిల్లాలోని సాగుదారులు: 2.41 లక్షలు
మొత్తం సాగుయోగ్య భూమి: 4,33,801 ఎకరాలు
భూసార పరీక్షలు చేసిన భూమి: 55,021 ఎకరాలు

# పడకేసిన బృహత్ ప్రణాళిక

ధర్మపురి : ధర్మపురి పట్టణంలో శాశ్వత, బృహత్తర ప్రాజెక్టులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాను అమలు, కరకట్ట నిర్మాణాలు, భక్తులకు వసతులు, నదీ పరిశుభ్రత తదితర సమస్యలను పట్టించుకోవడంలేదు. గత పురపాలక కమిషనర్ శ్రీనివాస్ అనిశాకు పట్టుబడగా.. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా రాజశేఖర్ పనిచేస్తున్నారు. ప్రత్యేక అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ వ్యవహరిస్తున్నారు.

ధర్మపురి పట్టణంలో బృహత్ ప్రణాళిక చేపట్టాలని గత రెండేళ్ల కిందటే ఉత్తర్వులు వచ్చాయి. ఈ లోపు శాసనసభ ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. రూ.25 కోట్లతో పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా పనులు చేపట్టగా.. ఈ పనులు సగం వరకు పూర్తయి నిలిచిపోయాయి. స్థానికులు కంకర రహదార్లతో ఇబ్బందులు పడుతున్నారు. పటేల్ కూడలి నుంచి రహదారి విస్తరణ చేపట్టినా.. పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

**వేతనాలకు ఎదురుచూపులు**

గత ఆర్థిక సంవత్సరం మున్సిపల్ ఆదాయం రూ.1.20 కోట్లు రాగా.. ప్రస్తుతం సిబ్బంది, కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఔట్ సోర్సింగ్ సిబ్బంది, కార్మికుల వేతనాలకు రూ.95 లక్షల నిధులు ప్రభుత్వం విడుదల చేసినా.. నేటికి చెల్లించలేదు. 51 మంది కార్మికులకు మూడు మాసాలుగా, 12 మంది కార్మికులకు 6 నెలల వేతనాలు రావాల్సి ఉంది. 2 ట్రాక్టర్లు, 1 స్వచ్ఛ ఆటో మరమ్మత్తులకు నోచుకోక మూలన పడ్డాయి.

**ప్రతిపాదన దశలోనే కరకట్ట నిర్మాణం**

వర్షాకాలంలో భారీగా వర్షాలు.. ఆపై కడెం జలాశయం నుంచి నీటి విడుదలతో ధర్మపురికి లక్షలాది క్యూసెక్కుల వరద నీరు చేరి వానాకాలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ సమస్య నివారణకు కేవలం నదికి 2 కి.మీ.ల దూరంలో రక్షణగా కరకట్టను నిర్మించాలనే ప్రతిపాదన ఏళ్ల తరబడి ఉంటోంది. దీనికి గత ప్రభుత్వ హయంలో రూ.4 కోట్లతో మున్సిపల్‌శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించింది. **నదీ జలాల స్వచ్ఛత ఇంకెప్పుడు?**

ధర్మపురి గోదావరి నదిలో డ్రైనేజీ నీరు కలవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.8 కోట్లతో మహా కాలువను నిర్మించినా.. రెండుచోట్ల మురుగు కాలువలను నిర్మించాల్సి ఉంది. ఓ వైపు ఎల్లంపల్లి జలాశయం చివరి ప్రాంతం ధర్మపురి బ్రహ్మగుండం కావడంతో ఈ నీరంతా అక్కడి వరకు చేరి నిలిచిపోతుంది. ఈ సమస్యలు తొలగాలంటే నీటిశుద్ధి ప్లాంటు నిర్మాణంతోనే సాధ్యపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి ఇరిగేషన్ విభాగం నుంచి రూ.17 కోట్లతో ఇటీవల అధికారులు ప్రతిపాదనలు పంపారు.

**తీరని పార్కింగు సమస్యలు**

పుణ్యక్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడి వాహనానికి రూ.50 రుసుము విధిస్తున్నారు. అయితే అధికారులు పార్కింగు సమస్యలపై పెట్టడంలేదనే విమర్శలున్నాయి. దీంతో వాహనాన్ని ఎక్కడ పడితే అక్కడే నిలుపుతున్నారు. ఏటా పార్కింగు నుంచి రూ.40 లక్షల ఆదాయం వస్తుండగా.. ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు.

# పల్లె పథకానికి ప్రతిఫలం

ధర్మారం: ధర్మారం మండలం బొట్లవనపర్తిలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద నాటిన మామిడి తోట ఇది. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా 2015లో మూడెకరాల్లో మొక్కలు నాటారు. పథకం కింద సంరక్షణ చర్యలతో పాటు ఎరువుల కోసం బిల్లులు చెల్లించారు. రెండేళ్లుగా ఫల సాయం వస్తోంది. ఈ ఏడాది కాత అధికంగా రావడంతో పంచాయతీకి రూ.75 వేల ఆదాయం వచ్చింది. ఇలా సామూహికంగానే కాదు, మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు ఉపాధిహామీ పథకంలో నాటిన మామిడి మొక్కలు ఫల సాయమిస్తున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో 5800 ఎకరాల్లో..**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి అనుబంధంగా చేపట్టిన పండ్ల తోటల పెంపకం సత్ఫలితాలిస్తోంది. 2007లో ఈ పథకం ప్రారంభం కాగా 2008లో ఊపందుకుంది.

అరకొరగా నీటి వసతి ఉన్న మెట్ట భూముల్లో పండ్ల తోటల సాగుతో పేద రైతులను ఆర్థికంగా పరిపుష్టం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తెచ్చింది.

పండ్ల మొక్కలు నాటాక మూడేళ్ల పాటు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు చెల్లిస్తుంది. నాలుగో సంవత్సరం నుంచి ఫల సాయం మొదలవుతుండటంతో రైతుల ఆర్థిక స్థితి మెరుగు పడుతుందనేది పథకం ఉద్దేశం. ఉపాధిహామీలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో మొత్తం 5800 ఎకరాల్లో మామిడి తోటలు పెంచుతున్నారు. ఇందులో ధర్మారం మండలంలోనే అత్యధికంగా 1,144 ఎకరాల్లో 586 మంది రైతులు మొక్కలు నాటారు. మొదట నాటిన మొక్కలు ప్రస్తుతం ఫల సాయం ఇస్తున్నాయి. కాతకు అనుగుణంగా ఎకరాకు రూ.20 వేల నుంచి



రూ.35 వేల వరకు ఆదాయం వస్తోంది.

పంచాయతీలకు ఆదాయం లేకపోవడం, ఖర్చులు అధికంగా ఉండటంతో నిర్వహణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూముల్లో మామిడి మొక్కలు నాటి సంరక్షిస్తే బొట్లవనపర్తిలా నికర ఆదాయ వనరుగా మార్చుకోవచ్చు.

**మూడేళ్ల వరకు సంరక్షణ బిల్లుల చెల్లింపు** ఉపాధిహామీలో పండ్ల తోటలు నాటాలనుకునే రైతులు గ్రామ స్థాయిలో ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, మండల పరిషత్తు కార్యాలయంలోని ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదించి, దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు అర్హులు. గుంతల తవ్వకం, మొక్కల కొనుగోలు, ఎరువుల ఖర్చులకు మూడేళ్ల వరకు ఎకరాకు దాదాపు రూ.30 వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఉపాధిహామీ కూలీలతో గుంతలు తవ్విస్తారు. ఆ తర్వాత కొద్ది రోజులకు పూడ్చేసి వర్షాలు కురవగానే మొక్కలను తెప్పించి నాటుతారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మారం మండల ఏపీవో రవి సూచించారు.

# బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో

సారంగాపూర్: 'సారంగాపూర్ మండలంలోని వడ్డెర కాలనీ సర్పంచి పల్లపు వెంకటేశ్ రూ.10 లక్షలు, పోచంపేటకు చెందిన పల్లికొండ రమేష్ రూ.30 లక్షలు, రేచపల్లి సర్పంచి ఎద్మల జయ రూ.25 లక్షలతో మురుగు కాలువల నిర్మాణం, సిమెంట్ రహదారుల తోపాటు పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టారు. పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా నిధులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం ఒక్క వడ్డెరకాలనీ, పోచంపేట రేచపల్లి మాజీ సర్పంచుల పరిస్థితి కాకుండా జిల్లాలో మాజీ సర్పంచుల ఆవేదన.' గ్రామాభివృద్ధి కోసం సొంత డబ్బులు వెచ్చించి ప్రస్తుతం నిధులు మంజూరు కాకపోవడంతో ఆర్థిక భారాన్ని మోయక తప్పడంలేదు. కొందరైతే అప్పులు తెచ్చి మరీ అభివృద్ధి పనులు చేపట్టారు. పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఏడాది దాటినా బిల్లులు రాకపోవడంతో వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 380 పంచాయతీలలో దాదాపు రూ.25,88,55,669 మేర బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. ఇందులో పల్లె ప్రగతి పనుల కింద రూ.5,14,84,967 ఉండగా ఇతర నిధుల కింద



రూ.20,73,70,702 ఉన్నట్లు ప్రభుత్వానికి అందించారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టగా ఆయా నిధులు కూడా పూర్తి స్థాయిలో మంజూరు కావడంలేదు. గత ప్రభుత్వం జిల్లాలో 72 రైతు వేదికలు నిర్మించగా పూర్తిస్థాయిలో బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 380 పాత పంచాయతీలు ఉండగా ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం సగటున రూ.6 కోట్ల వరకు మూడు నెలలకోసారి రూ.18 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు జమవుతుంటాయి. దాదాపు రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ నిధులు రాకపోగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు పాలకవర్గాలు లేకపోవడంతో నిలిచిపోయాయి. పంచాయతీల భారం పూర్తిగా కార్యదర్శులపై పడడంతో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తోంది.

**అప్పులపై వడ్డీ భారం**

అధికారంలో ఉండగా ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టాం. పదవీ కాలం ముగిసి ఏడాదికి పైగా గడిచినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడాల్సి వస్తోంది. నూతన పంచాయతీ కావడంతో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేశాం. బిల్లులు రాకపోవడంతో వడ్డీ భారం పడుతోంది. ప్రభుత్వం బకాయిలు వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలి. పల్లపు వెంకటేశ్, మాజీ సర్పంచి, వడ్డెరకాలనీ

# కర్ణాటక బాటలో.. గనుల నిర్వాహకులు



తాండూరు: తాండూరు నాపరాయికి దేశ, విదేశాల్లో మంచి పేరుంది. వ్యాపారం బాగుండడంతో చాలా మంది ఔత్సాహికులు ఈ రంగంలోకి వచ్చారు. ఇలా దాదాపు 40 ఏళ్లుగా నాపరాయి పరిశ్రమపై ప్రత్యక్షంగా పరోక్షంగా కలిపి 20వేల నుంచి 30వేల మంది కార్మికులు రోజూ వారిగా ఉపాధి పొందుతున్నారు. అయితే 2022 నుంచి ప్రభుత్వాలు తీసుకున్న అనూహ్య నిర్ణయాల వల్ల నాపరాయి పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లడం ప్రారంభమైంది. పరిశ్రమలకు సంబంధించి అన్ని అంశాల్లో ఫీజులు చాలా పెరిగాయి. ఇది వ్యాపారులకు ఆర్థిక భారంగా మారింది. ఈ నేపథ్యంలో చాలా మంది తమ వ్యాపార కార్యకలాపాలను తాండూరుకు సమీపంలో 14 కిలో మీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి మార్చారు. మిగిలిన వ్యాపారులు కూడా అటు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

**ఉపాధిపై తీవ్ర ప్రభావం**

తాండూరులో నాపరాళ్ల పరిశ్రమను నిర్వహించడం ఆర్థిక భారం కావడంతో 75 మంది వ్యాపారులు తమ పరిశ్రమలను కర్ణాటక రాష్ట్రం మిర్యాణ్ గ్రామానికి మార్చారు. ఇక్కడి నుంచి ముంబయికి నాపరాయిని ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఒక్కో యూనిట్లో 10 మంది చొప్పున మొత్తం 750 మంది కార్మికుల ఉపాధికి గండి పడింది.

**అక్కడి తరహా ఛార్జీలు ఆపాదించాలి**

తాండూరు నాపరాయికి కర్ణాటక తరహా ఛార్జీలు ఆపాదించాలని గతేడాది జులైలో రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్‌ను వ్యాపారులు కలిసి విన్నవించారు. తాజాగా విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వివరించారు.

**ఎకరం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు**

కర్ణాటక రాష్ట్రం మిరియాణం, కల్లూరు, పోలక్ పల్లిలో నాపరాయిగని ఎకరం ధర రూ.20లక్షల నుంచి 30 లక్షల లోపే. తాండూరు మండలం ఓగిపూరు, మల్కాపూరు, కరణ్కోటలో ఒక్కో ఎకరం నాపరాయి భూమి ధర ఏరియాను బట్టి రూ.30లక్షల నుంచి రూ.80 లక్షలు. కర్ణాటకలో ఒక్కో యూనిట్ విద్యుత్తు ఛార్జీ రూ.6.10 పైసలు ఉంటే తెలంగాణలో రూ.7.10 పైసలుగా ఉంది. ఇలా అధిక మొత్తాలు భరించలేక కర్ణాటకవైపు మొగ్గుచూపాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

# చివరి దశలో తెగుళ్లు.. రైతన్న దిగులు



గంగాధర: యాసంగిలో పంటలు సాగు చేసిన అన్నదాతకు వాతావరణ పరిస్థితులు కలసిరావడం లేదు. మెట్ట ప్రాంతాల్లో సాగునీరందక ఎండిపోగా, కాలువలు ఉన్న చోట అన్నదాత ఆశలపై తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ఫలితంగా పెట్టుబడుల భారం తడిసిమోపెడవుతుండగా దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రస్తుతం అగ్గితెగులు, మెడవిరుపు, సుడిదోమ ఉద్ధృతితో ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది.

జిల్లాలో ఎస్సారెస్పీ వరద కాలువ, కాళేశ్వరం, ఎల్లంపల్లి జలాలతో యాసంగిలో 2.66 లక్షల ఎకరాల్లో వరిపంట, 23 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడులు వెచ్చించారు. పంట సాగు మొదలుకుని మొగిపురుగు, ఆకుఎండు తెగులు, కంకి నల్లిపురుగు సోకి పంట ఎదుగుదల లేకుండా చేశాయి. ఇప్పటికే 20 శాతం పంటను నష్టం చేశాయి.

ఇది చాలదన్నట్లుగా ప్రకృతి కన్నెర్ర చేయడంతో ఇటీవల కురిసిన అకాల వర్షంతో జిల్లాలో వందలాది ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. యాసంగిలో ఎకరాకు 30 నుంచి 38 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా తెగుళ్ల ఉధృతితో 28 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పెట్టుబడులు పోనూ రెక్కల కష్టం కూడా వృథాగా పోతుందని ఆవేదన చెందుతున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో వరికి అగ్గితెగులు సోకి మెడవిరుపుతో గొలకలు మాడిపోతున్నాయి. ఇంకా కోతకు రాని వరిపంటలో తెగుళ్లతో ఇప్పటికే నష్టం జరగ్గా పరిస్థితి ఇంకా తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అంచనా వేస్తున్నారు.

విచ్చలవిడిగా మందుల వినియోగం

వాస్తవానికి పంటల సాగుకు ముందు దుక్కి దున్ని ఆరబెట్టాలి. ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి చేపట్టాలి. కొన్ని కంపెనీలు విత్తనశుద్ధి చేయకుండా ప్యాకింగ్ చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. రైతులే నేరుగా విత్తనాన్ని శుద్ధికరణ చేసుకుని పంట వేయాలి. తెగుళ్ల బారిన పడకుండా నాణ్యమైన విత్తనాల తయారీకి పరిశోధనా కేంద్రాల్లో శాస్త్రవేత్తలు చర్యలు చేపట్టాలి.

తెగుళ్ల బారిన పడ్డ పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే రైతుల అవసరాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. తెగుళ్ల నివారణకు వారి దుకాణంలో ఉన్న మందులను అంటగడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగుసార్లు మందుల పిచికారీ

మూడున్నరెకరాల్లో వరి పంట వేస్తే తెగుళ్ల ధాటికి పంటంతా దెబ్బతింది. మొగిపురుగు నివారణకు మూడు సార్లు మందు పిచికారీ చేయగా, ఇప్పుడేమో సుడిదోమతో నష్టం వాటిల్లుతుంది. అగ్గితెగులు, మెడవిరుపుతో పంటకు నష్టం వాటిల్లుతుంది. మందులు పిచికారీకి రూ.24 వేలు ఖర్చు చేశా.

రాములు, లక్ష్మీదేవిపల్లి (గంగాధర)

# జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



తాండూరు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన చోట నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. లబ్ధిదారులు ఉత్సాహంగా పనులు పూర్తి చేయిస్తున్నారు.

**144 మంది లబ్ధిదారుల గుర్తింపు**

తాండూరు మండలం చెంగెష్‌పూర్‌ను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి ఖాళీ స్థలం అందుబాటులో ఉన్న 144 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరందరికీ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గతనెలలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు ఆదేశించారు. దీంతో గృహ నిర్మాణ శాఖ, మండల పరిషత్ అధికారులు లబ్ధిదారుల స్థలాల వద్ద ముగ్గు వేసి పునాది పనులు ప్రారంభింపజేశారు. పదులసంఖ్యలో నిర్మాణాలు మొదలవగా కొన్ని పునాది దశలో నిర్మాణాలు పూర్తయ్యాయి. 500 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో నిర్మాణం చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

**తొలివిడత రూ.లక్ష చొప్పున ఖాతాల్లో..**

పునాది దశలో ఇళ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో తొలివిడతగా రూ.లక్ష సొమ్మును జమ చేయనున్నారు. అందుకు ఆయా బ్యాంకు ఖాతాల వివరాలను అధికారులు సేకరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫోటోలు తీసి బిల్లు చెల్లింపులకు ఆన్‌లైన్ ద్వారా సిఫారసు చేయనున్నారు. దీంతో రెండు మూడు వారాల్లో నగదును నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని ఎంపీడీఓ విశ్వప్రసాద్ వెల్లడించారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి పనులు కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నామని స్థానిక పర్యవేక్షకుడు ఆర్.వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వం అందించే సొమ్మును సద్వినియోగం చేసేలా వివరిస్తున్నామన్నారు.

**పునాదులు పూర్తయ్యాయి: మమత, చెంగెష్‌పూర్**

రెండు గదుల్లో ఐదుమంది ఉండేందుకు పన్నెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిన వెంటనే పనులు మొదలుపెట్టాం. పునాదులు పూర్తి చేశాం.

**మూడుసార్లు దరఖాస్తు చేశా: గౌరమ్మ, తాండూరు**

ఇల్లు కోసం గతంలో మూడుసార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేదు. ఈసారి సర్కారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించాం. వారం క్రితం పునాదులు పూర్తయ్యాయి.

# టన్నుకు పోతున్న మిల్లర్లు

భువనగిరి : జిల్లాలో యాసంగి ధాన్యం రాక ప్రారంభమైంది. అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభించలేదు. ప్రైవేట్ మార్కెట్‌లో క్రయవిక్రయాలు ప్రారంభమై వారం రోజులవుతోంది. జిల్లాలో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఏప్రిల్ రెండో వారంలో కొనుగోలు కేంద్రాలు తెరవాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలోని మోత్కూరు, రామన్నపేట మండలం కక్కిరేణి, మండల కేంద్రం అడ్డగుడూరు, చౌళ్లరామారం, ఆత్మకూర్(ఎం) మండలం పల్లెర్ల, లింగరాజ్‌పల్లిలో కేంద్రాలను ప్రారంభించారు. ఎక్కడా కొనుగోళ్లు చేపట్టలేదు.

జిల్లాలోని మోత్కూరు, అడ్డగుడూరు, రామన్నపేట, వలిగొండ ప్రాంతాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు 50 లక్షల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాలకు పంపించారు. 48 కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. వర్షాలు పడుతున్నందున వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మూసీ



పరీవాహక ప్రాంతంలో తొలుత వరికోతలు ప్రారంభం కానున్నాయి. రామన్నపేట, మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు తదితర ప్రాంతాల్లో పీపీసీలు తెరుస్తామని పౌరసరఫరాల సంస్థ డీఎం హరికృష్ణ తెలిపారు.

**ప్రైవేట్‌లో జోరుగా..**


కొందరు రైతులు పంట కోసిన వెంటనే వ్యాపారులకు అమ్మకోవడం ప్రారంభించారు. మార్చి చివరి వారం నుంచి లావాదేవీలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా మోత్కూరు, అడ్డగూడూరు ప్రాంతాల నుంచే ఎక్కుగా వడ్లు వస్తున్నాయి. ఇప్పటి వరకు మార్కెట్ యార్డుల్లో సుమారు రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అమ్మారు. మిల్లరు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సీఎంఆర్ ధాన్యం తక్కువ ఉన్న వారు కొనుగోలు చేసి సర్దుబాటు చేసుకుంటున్నారు. మిల్లర్లు 622 ఎంటీలు కొనుగోలు చేశారు. చెక్ పోస్టుల్లో 1191 ఎంటీలకు మార్కెట్ ఫీజుల వసూళ్లు చేశారు. ప్రైవేట్‌లో కోసిన పంటను అలాగే క్వింటాకు రూ.1810 నుంచి రూ.2300 వరకు విక్రయించారు. భువనగిరి మార్కెట్ యార్డు పరిధిలోనే కనిష్ఠ ధర. రూ.1810గా నమోదైంది. మిగిలిన మండలాల్లో రూ 2వేల నుంచి రూ.2,300 వరకు లభించింది.

# ఏడాదికి సరిపడా సన్నబియ్యం

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం జిల్లాలో నిరాటంకంగా కొనసాగనుంది. ఇందుకు అవసరమైన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్‌కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 748 రేషన్ దుకాణాల పరిధిలోని 4,10,988 లక్షల కార్డుల్లో 11,48,031 మంది వ్యక్తులు నమోదయ్యారు. వీరికోసం ఏప్రిల్ నెలకు 7,375.868 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. ఇలా రాబోయే పదకొండు నెలలకు సుమారు 82 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరం. అయితే జిల్లాలో 1.77 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అందుబాటులో ఉన్నాయి. అంటే రెండేళ్లకు సరిపోతాయి. కానీ ఇతర జిల్లాలకు సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉంటుంది. అందువల్ల కనీసం ఏడాది పాటు ఖమ్మం జిల్లాలో పండిన ధాన్యం నుంచి వచ్చిన బియ్యం ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

**గత ఖరీఫ్‌లో సన్నధాన్యం సేకరణ**

గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులు పండించిన ధాన్యం 2.96 లక్షల మెట్రిక్ టన్నులను పౌరసరఫరాలశాఖ అధికారులు కొనుగోలు చేశారు. క్వింటా ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్‌ను రైతులకు ప్రభుత్వం చెల్లించింది. ఇందులో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కోసం 2,63,775 మెట్రిక్ టన్నుల సన్నవడ్లు కేటాయించారు. ఈవడ్లు మరపట్టించగా 1,76,729 మెట్రిక్ టన్నుల బియ్యం వస్తాయి. ఇప్పటివరకు మిల్లుల నుంచి 93,918 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పౌరసరఫరాల సంస్థ అధికారులకు అందగా.. వాటిని జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లోని గోదాముల్లో నిల్వ చేశారు. ఇంకా 82,811 మెట్రిక్



టన్నుల సన్నబియ్యం మిల్లుల నుంచి రావాల్సి ఉంది. మిల్లుల నుంచి సన్నబియ్యాన్ని గడువులోగా తెప్పించేందుకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


**ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు సరఫరా**

ఖమ్మం జిల్లాలో సన్నబియ్యం మిగులు నిల్వలు ఉన్నందున పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లాకు 1,000 మెట్రిక్ టన్నులను శుక్రవారం పంపించారు. బియ్యం మిగులు నిల్వలు ఉన్న జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు ప్రతినెలా సర్దుబాటు చేస్తుంటారు. గతంలో దొడ్డు బియ్యాన్ని మిగతా జిల్లాల నుంచి ఖమ్మం జిల్లాకు కేటాయించేవారు. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో పండిన సన్నబియ్యం హైదరాబాద్ సహా ఇతర జిల్లాలకు సరఫరా కానుంది.

జిల్లాలో సమృద్ధిగా సన్నబియ్యం నిల్వలున్నాయి. గత ఖరీఫ్‌లో సేకరించిన సన్నవడ్లను మిల్లులకు అప్పగించి మర పట్టించగా వచ్చిన సన్నబియ్యాన్ని గోదాముల్లో నిల్వ చేస్తున్నాం. జిల్లాలోని రేషన్‌కార్డులకు సరిపడా సన్నబియ్యం ఏడాదంతా ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు సరఫరా చేసే స్థితిలో ఉన్నాం. ప్రస్తుత యాసంగిలో రైతులు పండించిన వడ్లు కొనుగోలు చేస్తున్నాం. వాటిని మరపట్టిస్తే సన్నబియ్యం నిల్వలు మరింత పెరుగుతాయి. ఘంటా శ్రీలత, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

# అవనిగా మెరిసిపోతున్న త్రిష

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ డైరెక్టర్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ సినిమా విశ్వంభర. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇవాళ త్రిష పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఓ సరికొత్త పోస్టర్ ను రిలీజ్ చేసింది. విశ్వంభరలో త్రిష అవని పాత్రలో కనిపించనుంది. మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ లో త్రిష సంప్రదాయ చీరకట్టులో భలే మెరిసిపోయింది. త్రిష బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఈ పోస్టర్ కు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తూ త్రిష కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్ భారీగా ఉండనున్నట్టు చిత్ర యూనిట్ ఇప్పటికీ క్లారిటీ ఇచ్చింది. చిరూ కెరీర్లోనే భారీ బడ్జెట్ తో




రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఓ వైపు షూటింగ్ ను నిర్వహిస్తూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేస్తూ మేకర్స్ నిర్మాణాన్ని చాలా వేగవంతం చేశారు. విశ్వంభరకు సంబంధించిన డబ్బింగ్ వర్క్ కూడా మొదలుపెట్టినట్టు చెప్తున్నారు. యువి క్రియేషన్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే త్రిష, చిరంజీవి కలిసి గతంలో స్టాలిన్ సినిమాలో నటించారు. అప్పట్నుంచి మళ్లీ ఇప్పటివరకు వీరిద్దరూ కలిసి నటించింది లేదు. ఇప్పటికే విశ్వంభర పై మంచి అంచనాలు నెలకొన్నాయి. నాలుగు పదుల వయసులో కూడా త్రిష కెరీర్ పరంగా వరుస అవకాశాలతో దూసుకెళ్తుంది. పొన్నియన్ సెల్వన్ సినిమాలతో సెకండ్ ఇన్నింగ్స్ ను స్టార్ట్ చేసిన త్రిష ఆ తర్వాత పలు స్టార్ హీరోలతో కలిసి నటించింది. ప్రస్తుతం త్రిష విశ్వంభర తో పాటూ థగ్ లైఫ్, సూర్య45, రామ్ సినిమాల్లో నటిస్తోంది.

# అనుష్క ఇదేం కరెక్ట్ కాదమ్మి..!

స్వీటీ అనుష్క ఘాటి సినిమా కోసం ఆమె ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా వెయిట్ చేస్తున్నారు. క్రిష్ డైరెక్షన్లో తెరకెక్కుతున్న ఈ సినిమా అసలైతే ఏప్రిల్ సెకండ్ హాఫ్ రిలీజ్ చేయాలని అనుకున్నారు కానీ సినిమా పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారు. యువి క్రియేషన్స్ బ్యానర్ లో రూపొందుతున్న ఘాటి సినిమా విషయంలో మేకర్స్ నుంచి కూడా ఎలాంటి అప్డేట్స్ రావట్లేదు. నిశ్శబ్ధం తర్వాత నాలుగేళ్లు గ్యాప్ ఇచ్చిన అనుష్క లాస్ట్ ఇయర్ మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టిలో నటించింది. ఆ సినిమా సక్సెస్ అయినా కూడా అనుష్క మళ్లీ వరుస సినిమాలు చేయట్లేదు. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది అనుకోవడం ఫ్యాన్స్ వంతు అయ్యింది. పోనీ కమిటైన క్రిష్ ఘాటి సినిమాకైనా అడిగిన డేట్స్ ఇస్తుందా అంటే సినిమా ఎప్పుడు పూర్తవుతుందా అన్నట్టుగా ఉందట. అనుష్క ఇంట్రెస్ట్ లేకుండానే



సినిమాలు చేస్తుందా అనుకుంటున్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా అదరగొట్టిన అనుష్క కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ సినిమాలను చేస్తూ వచ్చింది. అరుంధతి, రుద్రమదేవి లాంటి సినిమాలు చేయాలంటే అనుష్క వల్లే అవుతుందని ప్రూవ్ చేసుకుంది. ఐతే బాహుబలిలో కూడా ఆమె తన అందంతో మెప్పించింది. ఐతే తన లుక్స్ వైజ్ ఇంకా ఇదివరకులా లేదన్న కారణం చేతనే అనుష్క సినిమాలు చేయట్లేదు. ఐతే క్రిష్ సినిమా ఎలాగు చివరి దశకు వచ్చింది కాబట్టి దాన్ని పూర్తి చేసి నెక్స్ట్ ఏం చేయాలి అన్నది చూస్తుందట. ఘాటితో పాటు అనుష్క ఒక మలయాళ సినిమాకు కూడా సైన్ చేసింది. ఆ సినిమా ఎంతవరకు వచ్చిందో కూడా తెలియాల్సి ఉంది. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది.. ఆమె కెరీర్ గ్యాప్ కి అసలు రీజన్స్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. ఘాటి సినిమా టీజర్ తో సర్ ప్రైజ్ చేసిన అనుష్క మళ్లీ తిరిగి ఫాంలోకి వస్తుందని అనుకున్నారు. కానీ సినిమాని లేట్ చేస్తూ ఆడియన్స్ లో ఉన్న ఇంట్రెస్ట్ ని కోల్పోయేలా చేస్తున్నారు. ఘాటి పూర్తైతే కానీ అనుష్క నెక్స్ట్ సినిమాల గురించి అప్డేట్ వచ్చే ఛాన్స్ ఉంటుంది. తెర మీద అనుష్కని మిస్ అవుతున్న ఆమె ఫ్యాన్స్ మాత్రం ఎప్పుడొచ్చినా ఆమెను ఎంకరేజ్ చేసేందుకు రెడీగా ఉన్నారు. ఘాటి తర్వాత అనుష్క సినిమాలు చేసినా కాస్త స్పీడ్ గా చేస్తే బాగుంటుందని అంటున్నారు.




# దిఫోర్త్ కేస్ లో కార్తీ రోల్ ఇలా!




ది థర్డ్ కేస్ సక్సెస్ తో హిట్ ఫ్రాంచైంజీ బ్రాండ్ ఇమేజ్ అంత కంతకు రెట్టింపు అయింది. ఈసారి ఆ తాకిడి ఏకంగా పాన్ ఇండియాకే తాకింది. క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ కి ప్రేక్షకులకు బ్రహ్మరథం పడుతు న్నారు. దీంతో ఫోర్త్ కేస్ పై అంచనాలు అప్పుడే పీక్స్ కి చేరిపోతున్నాయి. ఫోర్త్ కేస్ లో హీరో ఎవరు? అన్నది ఇప్పటికే రివీల్ చేసారు. కోలీవుడ్ స్టార్ కార్తీని రంగంలోకి దించుతున్నారు. ఇందులో కార్తీ మరో కొత్త కేస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా కనిపించబోతున్నాడు. ఆ పాత్ర ఎలా ఉంటుందన్నది థర్డ్ కేస్ లో రివీల్ చేసాడు. అయితే ఆ పాత్ర లోతును మాత్రం రివీల్ చేయలేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ రోల్ ఎలా ఉంటుందన్నది శైలేష్ కొలను కొన్ని హింట్స్ ఇచ్చాడు. తనకు క్రికెట్ అంటే ఇష్టం. బెట్టింగ్స్ కూడా వేస్తుంటాడు. ఆ పాత్ర కాస్త రూటెడ్ గానూ ఉంటుంది. కొంత ఫన్ టచ్ కూడా ఉంటుంది. ఇంకా కార్తీకి పూర్తిగా కథ కూడా చెప్పలేదు. లైన్ ఏంటి? పాత్ర ఎలా ఉంటుందన్నది మాత్రమే చూపించాను. ఆయన దాన్ని నమ్మి నాకు అవకాశం ఇచ్చారు. ఆనమ్మకాన్ని అంతే నిలబెట్టుకోవాలి అన్నారు. శైలేష్ వ్యాఖ్యల్ని బట్టి హిట్ ధి థర్డ్ కేస్ విధానంలోనే ఈ సినిమా కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. హిట్ 2 లో నాని రోల్ ని రివీల్ చేసినట్లే హిట్ 3లో కార్తీ రోల్ రివీల్ చేసారు. అప్పటికి థర్డ్ పార్ట్ స్టోరీ కూడా సిద్దం కాలేదు.పాత్రని మాత్రమే పరిచయం చేసి వదిలేసారు. ఆ తర్వాత కథ రాయడానికి సమయం తీసుకుని మధ్యలో మరో సినిమా చేసి హిట్ 3ని పట్టాలెక్కించారు. ఇదే తరహాలో హిట్ 4 కూడా రూపొందుతుందని తెలు స్తోంది. అయితే శైలేష్ కొలను తదుపరి సినిమా ఏ హీరోతో చేస్తాడు? అన్నది ఇంత వరకూ రివీల్ చేయలేదు.

# టాలీవుడ్ స్టార్లకు సమ్మర్ బ్రేక్



టాలీవుడ్ లో ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులు సెట్స్ పై ఉన్న విషయం తెలిసిందే. తెలుగు సినిమా స్థాయి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన నేపథ్యంలో స్టార్ హీరోలు నటించే ప్రతీ సినిమానీ నిర్మాతలు భారీ బడ్జెట్ లతో నిర్మిస్తున్నారు. దీంతో ఒకప్పుడు తెలుగు సినిమాను పట్టించుకోని వాళ్లందరూ కూడా ఎప్పుడెప్పుడు ఆయా సినిమాలు రిలీజవుతాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో సెట్స్ పై ఉన్న భారీ సినిమాల్లో హరిహర వీరమల్లు, ఓజి, రాజా సాబ్, ఫౌజి, డ్రాగన్, పెద్ది. స్టార్ హీరోలు నటిస్తున్న ఈ సినిమాలను నిర్మాతలు భారీగా పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నారు. వారిలో ఎన్టీఆర్ తప్ప మిగిలిన స్టార్ హీరోలంతా సమ్మర్ లో ఈ షూటింగుల నుంచి బ్రేక్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ షూటింగ్ లో బిజీగా ఉన్నాడు ఎన్టీఆర్. మరికొద్ది రోజుల్లో ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ పూర్తవడంతో ఎన్టీఆర్ కూడా బ్రేక్ తీసుకోబోతున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ మినహా మిగిలిన హీరోలంతా ఆల్రెడీ షూటింగ్స్ నుంచి బ్రేక్ లోనే ఉన్నట్టు తెలుస్తోంది. అందులో ముఖ్యంగా మొదట చెప్పుకోవాల్సింది పవన్ కళ్యాణ్ గురించి. పవన్ పాలిటిక్స్ లో బిజీగా ఉండటం వల్ల ప్రస్తుతం షూటింగ్స్ కు హాజరయ్యే తీరిక లేదు. అందుకే షూటింగ్స్ నుంచి పవన్ బ్రేక్ లో ఉన్నాడని అంటున్నాం. ఒకవేళ పవన్ కు కుదిరి డేట్స్ అడ్జస్ట్ చేస్తే ఎంత సమ్మర్ లో అయినా సరే షూటింగ్ ను పూర్తి చేయడానికి రెడీగా ఉన్నారు హరిహర వీరమల్లు, ఓజి చిత్ర మేకర్స్. ఇక సూపర్ స్టార్ మహేష్ బాబు రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు. ఆల్రెడీ రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఎస్ఎస్ఎంబీ29 టీమ్, తర్వాతి షెడ్యూల్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో బ్రేక్ వచ్చింది. దీంతో మహేష్ ఖాళీగా ఉన్నాడు. బుచ్చిబాబు సానతో రామ్ చరణ్ చేస్తున్న పెద్ది షూటింగ్ కు సమ్మర్ కారణంగా చరణ్ బ్రేక్ ఇచ్చాడు. ప్రభాస్ మోకాలి గాయం వల్ల సర్జరీ చేయించుకుని ఆల్రెడీ గత కొంతకాలంగా రెస్ట్ లోనే ఉన్నాడు. ఇక అల్లు అర్జున్, అట్లీతో చేయబోయే సినిమా కన్ఫర్మ్ అయినప్పటికీ ఆ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకుని మొదలయ్యే సరికి జూన్ వచ్చేస్తుంది. సో టాలీవుడ్ స్టార్ హీరోలంతా సమ్మర్ లో బ్రేక్ లో ఉన్నట్టే అని చెప్పుకోవాలి.

# 'పుష్ప 2' తర్వాత 'పెద్ది'... ఇది చాలా స్పెషల్ గురూ!

టాలీవుడ్‌లో శ్రీలీల ప్రస్తుతం మోస్ట్ యాక్టివ్ హీరోయిన్ అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాయి. మొదటి సినిమా పెళ్లి సందడి పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అయినా కూడా లక్ కలిసి వచ్చి శ్రీలీలకు ధమాకా సినిమాతో బిగ్ హిట్ దక్కింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఏకంగా అర డజను సినిమాలు చేసే అవకాశం ను దక్కించుకున్న విషయం తెల్సిందే. గత ఏడాది మహేష్ బాబు మూవీ గుంటూరు కారం తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన ఏడాది చివర్లో పుష్ప 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమాలో కిస్సిక్ అంటూ శ్రీలీల చేసిన ఐటెం సాంగ్ మరో స్థాయికి సినిమాను తీసుకు వెళ్లింది. అందుకే శ్రీలీల క్రేజ్ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో పెరిగింది. కిస్సిక్ కారణంగానే బాలీవుడ్‌లో సినిమాను చేసే అవకాశంను దక్కించుకుంది. తమిళనాట కూడా ఈమె ఒక సినిమాను చేస్తుంది. హీరోయిన్‌గా వరుసగా సినిమాలు చేస్తున్న శ్రీలీల త్వరలోనే తెలుగులో ఒక బిగ్ సినిమాలో ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఆ బిగ్ మూవీ మరేదో కాదు మెగా పవర్ స్టార్ నటిస్తున్న పెద్ది సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో పుకార్లు గుప్పుమంటున్నాయి. రామ్ చరణ్ హీరోగా ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న



విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే ధీమాతో ప్రేక్షకులు ఉన్నారు. బుచ్చి బాబు ఈ సినిమా కోసం ఒక ప్రత్యేక పాటను ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. ఆ పాటను శ్రీలీలతో చేయిస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని నిర్మాతలు చర్చించారని సమాచారం అందుతోంది. పుష్ప 2 సినిమాతో శ్రీలీల ఐటెం సాంగ్‌తో ఆకట్టుకుంది. కనుక రిస్క్ తీసుకోకుండా, కొత్త అమ్మాయితో కాకుండా శ్రీలీలను ఐటెం సాంగ్ కు ఎంపిక చేయడం అనేది మంచి నిర్ణయం అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. శ్రీలీల కూడా ఐటెం సాంగ్స్ చేసేందుకు ఓకే అంటుంది. పైగా రామ్ చరణ్ వంటి బిగ్ స్టార్‌కి జోడీగా ఐటెం సాంగ్‌లో నటించడం, పైగా ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించిన పాటలో కనిపించాలి అనుకోవడం ఎవరికి అయినా డ్రీమ్. కనుక శ్రీలీల కచ్చితంగా అవకాశం వస్తే పెద్ది సినిమాలో ఐటెం సాంగ్ చేయడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ విషయం గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. త్వరలోనే మరింత క్లారిటీ రావాల్సి ఉంది. సుకుమార్ సినిమాను ఫాలో అవుతూ బుచ్చిబాబు పెద్ది సినిమాను తీస్తున్నాడు. కనుక ఐటెం సాంగ్ ఖచ్చితంగా ఉండబోతుంది. ఆ ఐటెం సాంగ్‌లో శ్రీలీల ఉంటుందా అనేది చూడాలి.

# టాప్ లెస్ ఫోజులో గుబులు రేపిన సోనమ్

ఈ భూప్రపంచంలో ఎన్నో సంస్కృతులు, ప్రాంతాన్ని బట్టి, దేశాన్ని బట్టి.. భాష వేషం సంస్కృతి ప్రతిదీ మారిపోతాయి. అలాగే ఈజిప్షియన్ కల్చర్ లో అత్యంత పురాతనమైన సంస్కృతి.. అక్కడి సమాధులు నిర్మాణాలు, వాటి వెనక కథలు ప్రజల హృదయాల్లో పాతుకుపోయాయి. మమ్మీ, మమ్మీ 2 సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విడుదలై సంచలన విజయం సాధించడం వెనక ఈజిప్ట్ కల్చర్ లో దాగి ఉన్న పురాణేతిహాస కథలు, పాత్రల యూనివర్శల్ అప్పీల్ ఒక కారణం అనడంలో సందేహం లేదు. చూస్తుంటే, ఇక్కడ భారతీయ ఫ్యాషనిస్టా సోనమ్ కపూర్ ఈజిప్ట్ టోంబ్ నుంచి నిదుర లేచిన మమ్మీ లా కనిపిస్తోంది. ఆ నుదుటిన భారీతనం నిండిన పాపిడి బొట్టులాంటి ఆ హారం.. ఇన్నర్ ఏదీ ధరించకుండా డ్యాషింగ్ టాప్ లెస్ ఫోజుతో




సోనమ్ తాజా ఫోటోషూట్ లో కట్టి పడేసింది. 39ఏళ్ల బ్యూటీ గ్లామర్ క్వీన్ ని తలపించింది. ఈ లుక్ చూడగానే గోల్డెన్ గాళ్ సోనమ్ అదిరిపోయింది అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. సోనమ్ కపూర్ అందాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఈ ఫ్యాషనిస్టా 14వ సారి వోగ్ ఇండియా కవర్ గర్ల్‌గా మెరుపులు మెరిపించింది. మేకప్ ఆర్టిస్ట్ నమ్రతా సోని సోనమ్ లుక్ ని డిజైన్ చేయగా, అది తన స్థాయిని అమాంతం పదింతలు పెంచింది. ఈ రూపం కోసం ఎంపిక చేసుకున్న మేకప్, వస్త్రాభరణాలు ప్రతిదీ వేటికవే ప్రత్యేకం. సోనమ్ కపూర్ గోల్డెన్ గర్ల్ స్టైల్, గ్లామ్ అవతార్ యువతరం హృదయాలను సున్నితంగా టచ్ చేసింది.

వీరే ది వెడ్డింగ్, ఏకే వర్సెస్ ఏకే, బ్లైండ్ వంటి చిత్రాలలో నటించాక, సోనమ్ నటనకు దూరంగా ఉంది. ప్రస్తుతం భర్తతో కలిసి విదేశాల్లో వ్యాపారాలను చక్కదిద్దుకుంటోంది.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 15 తేదీ నుంచి 26వ తేదీ వరకూ సరస్వతి పుష్కరాలు జరగనున్నాయి. దీనిపై మంగళవారం సచివాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ భేటీలో సీఎస్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. జరగబోయే సరస్వతి పుష్కరాల్లో హెలికాప్టర్ ప్రయాణం అందుబాటులోకి రానుంది. పుష్కరాలకు వచ్చిన భక్తులు కాళేశ్వరం ఆలయం, పుష్కర ఘాట్‌లు, చుట్టూ ఉన్న పచ్చటి అందాలను గగనతలం నుంచి వీక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం 'జాయ్‌రైడ్'ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఒకేసారి 6 గురు ప్రయాణించేందుకు వీలుగా ఎయిర్‌బస్ హెచ్-125 మోడల్ హెలికాప్టర్‌ను వినియోగించనుంది. టికెట్ ధరను ఒక్కొక్కరికీ రూ.4,500 చొప్పున ఖరారు చేయగా.. ప్రయాణ సమయాన్ని 6-7 నిమిషాలుగా నిర్ణయించారు. హెలికాప్టర్ ప్రయాణాలకు అవసరమైన సాంకేతిక అనుమతులు, ఇతరత్రా వ్యవహారాలు మొత్తం ఇప్పటికే పూర్తయ్యాయి. ఉదయం నుంచి సూర్యాస్తమయం వరకే జాయ్‌రైడ్‌లను నిర్వహించనున్నారు. కాగా, ఈ హెలికాప్టర్ ప్రయాణాల బాధ్యతలను బెంగళూరుకు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. జాయ్‌రైడ్‌లకు అవసరమైన సాంకేతిక అనుమతులను సదరు సంస్థే ఏర్పాటు చేసుకుంటుంది.

**సరస్వతి పుష్కరాలకు హెలీకాప్టర్ ఏర్పాటు..** పుష్కర ఘాట్‌లకు దగ్గర్లోనే హెలికాప్టర్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ, పర్యాటకశాఖలతో పాటు సివిల్ ఏవియేషన్ విభాగం సంయుక్తంగా హెలికాప్టర్ ప్రయాణాలను పర్యవేక్షించనున్నాయి. గతంలో మేడారం జాతరలోనూ దేవాదాయశాఖ హెలికాప్టర్ ప్రయాణాలను ఏర్పాటు చేసింది. అప్పుడు భక్తుల నుంచి మంచి ఆదరణ రావడంతో సరస్వతి పుష్కరాల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. కాగా, బెంగళూరు నుంచి కాళేశ్వరానికి మళ్లీ ఇక్కడి నుంచి అక్కడకు హెలికాప్టర్ ఖాళీగా వచ్చి, వెళ్లాల్సిన నేపథ్యంలో రూ.20 లక్షలను ప్రభుత్వం చెల్లించనుంది. అదే విధంగా హెలిప్యాడ్‌కు దగ్గర్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక బృందాలను అందుబాటులో ఉంచనుంది. హెలికాప్టర్ ప్రయాణ బాధ్యతలను తీసుకున్న సంస్థ గతంలో 15 వేల మంది భక్తులకు జాయ్‌రైడ్‌లను అందించిందని వెల్లడించింది. టికెట్ల బుకింగ్ కోసం టోల్ ఫ్రీ నంబరును త్వరలో ప్రకటించనున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.




# 14 ఏళ్ల తర్వాత సీబీఐ కోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్, మే 6: ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ఏ1గా ఉన్న బీవీ శ్రీనివాస్ రెడ్డి, ఏ2 గాలి జనార్ధన్ రెడ్డికి నాంపల్లిలోని సీబీఐ కోర్టు శిక్ష ఖరారు చేసింది. ఇదే కేసులో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషిగా సీబీఐ కోర్టు తేల్చేసింది. సబితతోపాటు ఏ8 కృపానందంను కూడా న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసులో శ్రీనివాసరెడ్డి, గాలి జనార్ధన్ రెడ్డితో పాటు ఏ3 వీ.డీ రాజగోపాల్, ఏ4 ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, ఏ7 అలీ ఖాన్‌లకు కోర్టు శిక్ష ఖరారు చేసింది. ఓఎంసీ కేసులో కేసులో గాలి సోదరుడు బీవీ శ్రీనివాస్ రెడ్డి, గాలి జనార్దన్ రెడ్డికి కోర్టు ఏడేళ్ల శిక్ష విధించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన అనంతపురం జిల్లా ఓబులాపురం మైనింగ్ కేసుకు సంబంధించి ఈరోజు (మంగళవారం) సీబీఐ కోర్టు సంచలన తీర్పును వెల్లడించింది. ఐదు మంది నిందితులను ఇప్పటికే దోషులుగా తేల్చుతూ వారికి శిక్షలు కూడా ఖరారు చేసింది కోర్టు. ఏ1 శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న ఏ2 మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి కూడా ఏడు సంవత్సరాల పాటు శిక్షను ఖరారు చేసింది న్యాయస్థానం. ఈ కేసులో ఇద్దరు నిందితులుగా ఉన్న మాజీ మంత్రి సబిత, ఐఏఎస్ కృపానందంను నిర్దోషిగా ప్రకటిస్తూ సీబీఐ కోర్టు కీలకమైన తీర్పును వెల్లడించింది. దాదాపు 14 ఏళ్ల పాటు సుదీర్ఘంగా విచారించిన తర్వాత నాలుగు చార్జ్‌షీట్లను ఇప్పటికే సీబీఐ కోర్టు ముందు సీబీఐ అధికారులు సమర్పించారు. 14 ఏళ్ల పాటు విచారణ అనంతరం సీబీఐ కోర్టు కీలక తీర్పును వెల్లడించింది. ఏ1, ఏ2లకు ఏడేళ్ల పాటు శిక్షలు ఖరారు అయ్యాయి. అలాగే మిగిలిన దోషులకు కూడా కోర్టు ఏడేళ్ల శిక్ష విధించింది కోర్టు. ఈ కేసులో ఐపీసీ 120బి రెడ్ విత్ 420, 409, 468, 471లతో పాటు కొంతమందిపై అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13 (2) రెడ్ విత్ 13 (1)(డి)కింద సీబీఐ అధికారులు అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసులో చాలా మంది సాక్షులను విచారించారు. సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్లను ఆధారంగా చేసుకుని సీబీఐ విచారణలో అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే ఈరోజు సీబీఐ కోర్టు ఈమేరకు తీర్పునిచ్చింది. ఓబులాపురం అక్రమ మైనింగ్‌పై 2009, డిసెంబర్ 7న సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. 2011లో మొదటి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. మొదటి ఛార్జ్‌షీట్‌లోనే ఏ1, ఏ2లుగా ఉన్న గాలి జానార్దన్ రెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస్ రెడ్డి కలిసి అక్రమంగా ఓబులాపురం మైనింగ్స్‌ను తవ్వి వాటిని ఎక్స్‌పోర్ట్ చేస్తున్నారని పేర్కొన్నారు. దీని ద్వారా దాదాపు రూ.844 కోట్లు ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని ఆ ఛార్జ్‌షీట్‌లో పొందుపర్చారు. ఈ కేసులో దాదాపు 219 మంది సాక్షులను న్యాయస్థానం ముందు ఉంచి వారి స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారు. వారి ఇచ్చిన స్టేట్‌మెంట్లను ఆధారంగా చేసుకుని ఈకేసులో చాలా అంశాలు వెలుగులోకి వచ్చాయి. మరోవైపు డాక్యుమెంట్ ఎవిడేషన్‌ను కూడా న్యాయస్థానం ముందు పెట్టింది సీబీఐ. డాక్యుమెంట్ ఎవిడేషన్ కింది దాదాపు 3337 డాక్యుమెంట్లను కోర్టు ముందు ఉంచింది. సాక్షుల స్టేట్‌మెంట్లు, డాక్యుమెంట్లను వెరిఫై చేసిన తర్వాత న్యాయస్థానం దోషులకు శిక్షను విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే అప్పటి ప్రభుత్వంలో గనుశాఖమంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి మాత్రమే ఇప్పటి వరకు ఈ కేసులో అరెస్ట్ కాలేదు. ఈ కేసులో మిగిలిన నిందితులంతా కూడా అరెస్ట్ అయి జైలుకు వెళ్లారు. ఈ కేసులో సబిత డిశ్చార్జ్ పిటిషన్ వేసినప్పటికీ కూడా ఈకేసులో ఈమె పాత్ర కీలకమని గతంలో డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టివేసింది కోర్టు. అయితే ఈకేసులో సబిత, కృపానందరం పాత్ర లేదని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలను లేనందున వారిని నిర్దోషులుగా ప్రకటిస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.




హైదరాబాద్: తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని.. నాయకులు వెనుకబడేసిన ప్రాంతమని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఈ ప్రాంతంలో రైల్వే, విద్యుత్, టెలిఫోన్ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు.

ఒక వ్యక్తిని, ఒక పార్టీని దోషిగా నిలబెట్టేందుకు తెలంగాణను దివాలా రాష్ట్రంగా చూపొద్దన్నారు. సోమవారం ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఈటల ఈ విధంగా స్పందించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రమని సీఎం రేవంత్ పేర్కొనడం సరికాదు. ధాన్యం దిగుబడి, జీఎస్‌డీపీ, వృద్ధిరేటు, అత్యధిక బడ్జెట్‌స్థాయి వంటి అంశాల్లో అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం ధ్వంసం చేస్తున్నారు. కొత్త రాష్ట్రమే అయినా తడబాటు లేకుండా గొప్పగా పురోగమిస్తున్నామని గతంలోనే చెప్పాను. 2014లోనే తెలంగాణ సొంత పన్నుల ఆదాయం రూ.29వేల కోట్లు. ఏటా రూ.5వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల ఆదాయం పెరిగేది. 2023-24లో రూ.1.19లక్షల కోట్ల ఆదాయం రాష్ట్రానికి వచ్చింది. పన్నేతర ఆదాయం కూడా 2014లోనే రూ.6వేల కోట్లు.. 2023-24లో రూ.20వేల కోట్లు ఉంది. కేంద్రం పంపిణీ చేసే పన్నుల ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోంది" అని ఈటల రాజేందర్ వివరించారు.

# తెలంగాణలో ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో కాంగ్రెస్: కేంద్రమంత్రి బండి సంజయ్




కరీంనగర్: రాష్ట్రానికి పెద్దగా భావించే ముఖ్యమంత్రే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రభుత్వ పెద్దగా ప్రజల్లో ధైర్యం నింపాల్సిందిపోయి అధైర్యాన్ని నూరిపోస్తూ రాష్ట్రం పరువు తీస్తున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం నడపలేమనే స్థితిలో కాంగ్రెస్ ఉందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే అడ్డగోలు హామీలు ఇచ్చారని.. ఇప్పుడు ఆరు గ్యారంటీలు అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. కేంద్రమంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని సీఎం చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చిన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

# తెలంగాణ అప్పులకు కారణమిదే.. మంత్రి పొంగులేటి హాట్ కామెంట్స్



ఖమ్మం జిల్లా: కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ. 18 నుంచి రూ.19 వేల కోట్లకు పైగా అప్పు చేసిందని ఆరోపణలు చేశారు. ఆ అప్పులు తీర్చుకుంటూ తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని ఉద్ఘాటించారు. నిజాన్ని తప్పుగా మార్చుతూ ప్రజలను బీఆర్ఎస్ నేతలు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పెద్ద మహా వృక్షం.. ఆ మహా వృక్షం కింద ఎన్ని కోట్ల మంది అయినా సేద తీర్చుకోవచ్చని చెప్పారు. ఇవాళ(మంగళవారం) కూసుమంచిలో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఎత్తు పల్లాలు సహజమని అన్నారు. బ్యాంకులను జాతీయం చేసి పేదవారికి ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పంచి ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రాంతీయ పార్టీలు తారాజు వల్ల ఎగిరి కిందపడతాయన్నారు. కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నామని గర్వంగా చెప్పుకుంటామని అన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు జాతీయ, రాష్ట్ర నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ, నాయకులు కుటుంబ సభ్యులు కృషి ఎంతో ఉందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ కలిసే ఉంటారని అన్నారు. ఉద్యోగ సంఘాలను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఉద్యోగులు వారిపై ఎదురు దాడి చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనని దాన్ని అన్నట్లు ప్రతిపక్షం ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.




పహల్గాం ఉగ్రదాడి వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. పహల్గాంలో మరింత భద్రత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. 'సంవిధాన్ బచావో' పేరుతో రాంచీ వేదికగా నిర్వహించిన సభలో ఖర్గే ఈ విధంగా స్పందించారు. "దేశంలో పరిస్థితుల గురించి మీ అందరికీ తెలుసు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యం ఉందని ప్రభుత్వం అంగీకరించింది. ఇంటెలిజెన్స్‌ను పటిష్ఠ పరచుకుంటామని వాళ్లే చెప్పారు. దాడికి మూడు రోజుల ముందే నిఘా సమాచారం ఉందని నాకు తెలిసింది. అలాంటప్పుడు అక్కడ (పహల్గాంలో) తగినంత భద్రతా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నా " అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని మల్లికార్జున ఖర్గే మరోసారి స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా దేశమే తొలి ప్రాధాన్యమన్నారు. రాజకీయ విభేదాలకంటే జాతీయ ఐక్యతే ముఖ్యమన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఖర్గే.. ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడమే మోదీ విధానమని ఆరోపించారు. ఆదివాసీ నేతలను భయపెట్టే ధోరణిని అవలంబించకూడదని కేంద్రానికి సూచించారు.

# ఇప్పుడిప్పుడే ఆర్టీసీ కోలుకుంటోంది.. సమ్మెకు వెళ్లొద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్: ఆర్టీసీ సమ్మె ఆలోచన విరమించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాల నేతలు మంత్రిని కలిశారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ కోలుకుంటోందని.. సమ్మెకు వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని కార్మిక సంఘాల నేతలను పొన్నం కోరారు. కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మరోవైపు సమ్మె ఆలోచనను విరమించుకోవాలని ఆర్టీసీ సిబ్బందికి యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఉద్యోగులకు బహిరంగ లేఖ రాసింది. తల్లిలాంటి ఆర్టీసీని కాపాడుకునేందుకు సహకరించాలని కోరింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది. "ప్రభుత్వ సహకారంతో సమస్యలు పరిష్కరించుకుందాం. సంస్థ ఇప్పుడిప్పుడే కోలుకుని అభివృద్ధి పథంలోకి వెళ్తోంది. 2019లో జరిగిన సమ్మె వల్ల సంస్థ సంక్షోభంలోకి వెళ్లింది. ఒక వర్గం మనుగడ కోసం చెప్పే మాటలకు ప్రభావితం కావొద్దు. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు నిషేధం. సమ్మె పేరుతో ఉద్యోగులను ఎవరైనా బెదిరించినా.. విధులకు ఆటంకం కలిగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు"అని ఆర్టీసీ యాజమాన్యం హెచ్చరించింది.

# 70% టీసీఎస్ ఉద్యోగులకు నూరు శాతం వేరియబుల్ పే




ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ జనవరి- మార్చి త్రైమాసికానికి వేరియబుల్ పే అలవెన్స్‌ను చెల్లించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేసినట్లు టీసీఎస్ తెలిపింది. తమ తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యోగులకు వేరియబుల్ పే చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. ప్రతి త్రైమాసికంలోనూ టీసీఎస్ ఇదే విధానాన్ని అవలంబిస్తోందని ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు ఇటీవల మార్చి నెల త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన టీసీఎస్.. రూ.12,224 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్జిన్లు తగ్గడంతో నికర లాభం 1.7 శాతం మేర క్షీణించింది. ఆదాయం మాత్రం గతేడాదితో పోలిస్తే 5.3 శాతం వృద్ధితో రూ.64,479 కోట్లుగా నమోదైంది. అయితే, త్రైమాసిక ఫలితాల సందర్భంగా 6.07 లక్షల మంది ఉద్యోగులకు వార్షిక వేతన పెంపును వాయిదా వేసినట్లు ప్రకటించింది. సుంకాల కారణంగా నెలకొన్న అనిశ్చితిని ఇందుకు కారణంగా చూపింది. సాధారణంగా ఏప్రిల్ నెలలో వేతన పెంపు ఉంటుంది. ఈసారి ఎప్పుడు చెల్లించేదీ మాత్రం టీసీఎస్ వెల్లడించలేదు.

# ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాల కేసు.. క్యామ్‌సైన్ డైరెక్టర్ ధాత్రి మధు అరెస్టు




హైదరాబాద్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాల కేసులో 'క్యామ్‌సైన్ మీడియా' సంస్థ డైరెక్టర్ ధాత్రి మధును పోలీసులు అరెస్టు చేశారు. గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో హైదరాబాద్‌లోని అతడి కార్యాలయంలో మధును ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విజయవాడకు తరలిస్తున్నారు. మూల్యాంకన కుంభకోణం కేసులో మధును ఏ2గా కోర్టులో పోలీసులు హాజరుపరచనున్నారు. హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకన నిర్వహణ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా కొటేషన్ విధానంలో పొందిన క్యామ్‌సైన్ సంస్థ.. ఇతర విషయాల్లోనూ అవకతవకలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కుంభకోణంపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులను ఏ1గా చేర్చిన విషయం తెలిసిందే.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com